ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
ఆదివారం 24 ఆగస్టు 2025

గూడు లేని ప్రతి నిరుపేదకు సొంతింటి కల సాకారం చేస్తామంటూ వైసీపీ ప్రభుత్వంలో గుట్టలు, వాగులు, వంకలు, ముళ్లపొదలు అల్లుకుపోయి నిర్మాణాలకు అనువు కాని ప్రాంతాల్లో వేల ఇళ్లు మంజూరు చేశారు. చిన్నపాటి వర్షం పడినా ఆ కాలనీలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. వీధులన్నీ ఊట కాలువల్లాగా మారి నీరు ప్రవహిస్తోంది. జగనన్న కాలనీలలో కనీస వసతులు లేక లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

ఊటెక్కాయి..!


సప్లయ్ ఛానళ్లను తలపిస్తున్న వీధులు


ఇళ్ల మధ్య నీటిగుంతలను తలపిస్తున్న పునాదులు

- కాలువలను తలపిస్తున్న వీధులు
- ఇళ్ల మధ్య నీటిగుంతలతో తప్పని ఇక్కట్లు
- మౌలిక వసతుల కల్పన ఎన్నటికో...?
- ప్రతిపాదనలకే పరిమితమైన రోడ్లు, కాలువలు, తాగునీరు
- ఇదీ జగనన్న కాలనీల దుస్థితి...

పీలేరు రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో కనీస మౌలిక వసతులు లేక లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పీలేరు పట్టణ శివారు ప్రాంతం తిరుపతి మార్గంలోని ఆయిల్ సీడ్ ఫ్యాక్టరీ లేఔట్‌లో 689 ఇళ్లు, సమీపంలోని కంకర ఫ్యాక్టరీ లేఔట్‌లో 1146 ఇళ్లు మంజూరు చేశారు. ఇటీవల కురిసిన కుండపోత వర్షానికి ఈ రెండు కాలనీలు ఊటుపట్టి ఎక్కడికక్కడే నీరు నిలిచిపోయి కుంటలను తలపిస్తున్నాయి. వీధులన్నీ సప్లయ్ ఛానళ్లను తలపిస్తున్నాయి. పలుచోట్ల పునాదులు వర్షపు నీటితో మునిగిపోయి బావులను తలపిస్తున్నాయి. పలు వీధులలో పిచ్చిమొక్కలు అల్లుకుపోయి అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. వీధులలో ద్విచక్రవాహనాలు పోవాలన్నా వీలుకాని దుర్భర పరిస్థితులు ఉన్నాయి. నాలుగు చినుకులు పడినా వర్షపు నీటి ప్రవాహం కాలనీలను ముంచెత్తుతోంది. వీధులు, మురుగునీటి కాలువలు, వీధి లైట్ల ఏర్పాటు ఎన్నటికో అన్న అనుమానం సర్వత్రా నెలకొంది. కనీస వసతులకు నోచుకోక సమస్యల సంద్రంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

కంకర ఫ్యాక్టరీ లేఔట్‌లో 1146 ఇళ్లు మంజూరు చేయగా ఇందులో 714 ఇళ్ల నిర్మాణం ప్రారంభించి ఇప్పటి వరకు కేవలం 161 ఇళ్లు కట్టారు. ఇందులో 421 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌కే పరిమితం కాగా 48 వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఆయిల్‌సీడ్స్ ఫ్యాక్టరీ లేఔట్‌లో 689 ఇళ్లు మంజూరు కాగా 478 నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో 156 నిర్మాణం పూర్తి కాగా మరో 41 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. 252 ఇళ్లు పునాదులకే పరిమితమయ్యాయి. కాలనీలు సమస్యలకు కేంద్ర బిందువుగా మారాయి. జనం గొంతు తడపడం కోసం తాగునీటి సౌకర్యం కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. రాత్రివేళల్లో పాముల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుట్టలు, వాగులు, వంకల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. నిర్మాణానికి అవసరమైన స్టీలు, సిమెంట్, ఇటుకలు, కంకర, నీరు తీసుకెళ్లే మార్గం కానరావడం లేదు. ఏళ్లు గడుస్తున్నా పనులలో ప్రగతి కానరావడం లేదు. కనీస వసతులకు నోచుకోకపోవడంతో సర్వత్రా ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రతిపాదనలు పంపించాం..



పీలేరు పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న మూడు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. రోడ్లు, వీధులు, మురుగునీటి కాలువలు నిర్మించాల్సి ఉంది. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సూచనల మేరకు రూ.7 కోట్లతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపాము.

- రమణయ్య, హౌసింగ్ ఏఈ, పీలేరు

ఇల్లు ఎలా కట్టుకోవాలి...?



కాలనీలో ఎటువంటి సౌకర్యాలు లేవు. ఇల్లు కట్టండి కట్టండి అంటారు ఎలా కట్టుకోవాలి. నాలుగు చినుకులు రాలితే మనుషులు కూడా రాలేని పరిస్థితి. కనీస వసతులు కల్పించడం లేదు. కూలీనాలి చేసుకొని బతుకుతున్నాం. ప్రభుత్వం ఇళ్ల మంజూరుతో చేతులు దులుపుకుంది. మా బాధలు ఎవరూ పట్టించుకోవడం లేదు. మౌలిక వసతులు కల్పించాలి.

- నౌషాద్, ఆయిల్ సీడ్స్ ఫ్యాక్టరీ లేఔట్, పీలేరు

కనీస వసతులు కల్పించాలి...



కాలనీలో కనీస వసతులు కల్పించాలి. ఇప్పటి వరకు రోడ్లు, కాలువలు, నీటి సౌకర్యం లేదు. వీధులన్నీ అస్తవ్యస్తంగా మారాయి. వర్షం పడితే అన్నీ ఇబ్బందులే. ఇళ్ల మంజూరుతో పాటు మౌలిక వసతులు కల్పించాలి. ఇప్పటి వరకు ఇక్కడ ఎటువంటి సౌకర్యాలకు నోచుకోలేదు. ఇంకెప్పుడు కనీస వసతులు కల్పిస్తారో చెప్పలేం.

- జి.బాబు, ఆయిల్ సీడ్స్ ఫ్యాక్టరీ లేఔట్, పీలేరు


అరకొర నిర్మాణాలతో దర్శనమిస్తున్న ఆయిల్ సీడ్స్ ఫ్యాక్టరీ లేఔట్

అమావాస్య అయినా..అగలేదు

- 11 బార్లకు 37 దరఖాస్తుల ఎన్‌రోల్‌మెంట్
- బ్యాంకులకు రెండు రోజుల సెలవులు అడ్డంకి

మదనపల్లె టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అమావాస్య, పాడ్యమి అంటేనే చాలా మంది శుభకార్యాలు, కొత్త వ్యాపారాలకు వెనకడుగు వేస్తారు. కానీ జిల్లాలో కొత్త బార్ల నోటిఫికేషన్ పడగానే మద్యం వ్యాపారులు అమావాస్య అయినా ఆగలేదు, కొత్త బార్ల కేటాయింపునకు అవసరమైన దరఖాస్తులను ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఈ సంఖ్య దాదాపు రెట్టింపు, ట్రిబుల్‌గా ఉండటం గమనార్హం. అన్నమయ్య జిల్లాలో 11 ఓపెన్ కేటగిరీ బార్లు, ఒక గీత కులానికి కేటాయించిన బార్‌కు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానంలో మద్యం వ్యాపారులు దరఖాస్తులను ఎన్‌రోల్‌మెంట్ చేసుకుంటున్నారు. జిల్లాలో 11 ఓపెన్ క్యాటగిరీ బార్లకు రెండు (శుక్ర, శనివారాలు) రోజుల్లోనే 37 మంది దరఖాస్తులను ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. ఇకపోతే కడప జిల్లాలో 27 ఓపెన్ కేటగిరీ బార్లకు నోటిఫికేషన్ వెలువడగా శనివారం సాయంత్రం 5 గంటల వరకు 50 మంది దరఖాస్తులను ఎన్‌రోల్ చేసుకున్నారు. కాకపోతే నాలుగో శనివారం (23వ తేదీ), ఆదివారం బ్యాంకులకు వరుస సెలవులు రావడంతో బార్ల లక్కీ డ్రాల్లో పాల్గొనేందుకు చెల్లించాల్సిన రూ.55 లక్షల డిపాజిట్, రూ.10 వేల ప్రాసెసింగ్ ఫీజు చెల్లించలేకపోయారు. దీంతో చివరి రెండు రోజులైన సోమవారం, మంగళవారం మద్యం వ్యాపారులతో బ్యాంకుల వద్ద హడావుడి కనిపించనుంది. కొంతమంది ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లో కూడా డిపాజిట్లు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏది ఏమైనా చివరి రెండు రోజుల్లో బార్లను దక్కించుకునేందుకు మద్యం వ్యాపారుల మధ్య ఓ మోస్తారు పోటీ వస్తుందని ఎక్సైజ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఉర్దూ మీడియంలో అఫ్రిన్‌తాజ్‌కు మొదటి ర్యాంకు



నిమ్మనపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఫలితాల్లో పలితాల్లో నిమ్మనపల్లెకు చెందిన షేక్ అఫ్రిన్‌తాజ్ ఎస్టీటీ ఉర్దూ మీడియంలో 83.03 మార్కులు సాధించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొదటి ర్యాంకు సాధించింది. ఈమె తండ్రి సయ్యద్ సాబ్ టైలర్ కాగా తల్లి జరీనాతాజ్ గృహిణి. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ బిడ్డ అఫ్రిన్‌తాజ్ ఎంతో కష్టపడి చదివి మొదటి ర్యాంకు సాధించడం గర్వకారణంగా ఉందని తెలిపారు.

డీఎస్సీ ఫలితాల్లో ములకలచెరువు మహిళ ప్రతిభ

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడో ర్యాంకు


ప్రతిభ చూపిన కవిత

ములకలచెరువు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఫలితాల్లో ములకలచెరువుకు చెందిన మహిళ అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడో ర్యాంకు నిలిచింది. స్థానిక వినాయకనగర్‌లో నివాసమున్న దాసరిపల్లి సదాశివరెడ్డి భార్య కవిత డీఎస్సీ ఎస్‌జీటీ ఫలితాల్లో 92.43 మార్కులు సాధించింది. కుటుంబీకులు, తల్లిదండ్రుల సహకారం, ప్రోత్సాహంతోనే తాను ర్యాంకు సాధించినట్లు ఆమె తెలిపింది.

అందరికీ ఆదర్శం టంగుటూరి ప్రకాశం పంతులు

- డీఆర్‌వో మధుసూదన్‌రావు

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కేసరి టంగులూరి ప్రకాశం పంతులు అందరికీ ఆదర్శమని, ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని డీఆర్‌వో మధుసూదన్‌రావు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకలను రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మారుమూల గ్రామంలో పుట్టి చదువుకొని న్యాయవాది వృత్తి చేపట్టి అనంతరం స్వరాజ్యం అనే దినపత్రిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వేచ్ఛా స్వతంత్రాల కోసం గర్జించి జగతిని జాగృతం చేసి యువతలో స్వాతంత్ర్య ఉద్యమకాంక్షను రగిలించిన త్యాగధనులు ఆంధ్ర కేసరి అన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో నాగభూషణం, కలెక్టర్ సెక్షన్‌ల సూపరింటెండెంట్లు, తహసీల్దార్ నరసింహకుమార్, కలెక్టర్ కార్యాలయపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు

రక్తం అందుబాటులో ఉండేలా చర్యలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్
- రక్తదానం చేసిన జేసీ, సబ్ కలెక్టర్


రక్తదానం చేస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, మదనపల్లె సబ్ కలెక్టర్ కళ్యాణి

రాయచోటి (నేతాజీసర్కిల్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోగులకు అవసరమైన రక్తాన్ని నిరంతరం అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కేవలం 10 యూనిట్ల రక్తం మాత్రమే అందుబాటులో ఉండడం గ్రహించి వెంటనే రెవెన్యూ అసోసియేషన్ స్పందించి కనీసం 200 యూనిట్ల రక్తాన్ని ఉచితంగా అందించేందుకు ముందుకు రావడాన్ని కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో పంచాయతీరాజ్, ఇతర ప్రభుత్వ విభాగాలు, విద్యాసంస్థలు, ఇంజనీరింగ్ కాలేజీల వంటి వర్గాలను కూడా రక్తదాన శిబిరాల్లో పాల్గొనేలా ఆహ్వానిస్తామని కలెక్టర్ తెలిపారు. రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో 200 యూనిట్ల రక్తాన్ని సేకరించడమే లక్ష్యం అన్నారు. రక్తదానం చేసిన వారికి కలెక్టర్, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి జ్యూస్ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, డాక్టర్ సిద్దిక్, టీడీపీ నాయకుడు గాజుల ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

యూరియా విక్రయకేంద్రాల్లో తనిఖీలు

- అక్రమాలు జరిగితే కఠిన చర్యలు : సబ్ కలెక్టర్


ఎరువుల దుకాణంలో రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కళ్యాణి

మదనపల్లె టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా డిమాండ్, అక్రమ విక్రయాలపై ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన 'యూరియా.. లేదయా...' అన్న వార్తకు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ స్పందించారు. జేసీ ఆదేశాల మేరకు శనివారం మదనపల్లె పట్టణంలోని ఎరువుల దుకాణాలను, రైతు సేవా కేంద్రాలను సబ్ కలెక్టర్ కళ్యాణి, తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి, విజిలెన్స్ అధికారులు, బయట మండలాల నుంచి వచ్చిన ఎంపీడీవోలు నాలుగు బృందాలుగా విడిపోయి వేర్వేరుగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సీటీఎం రోడ్డులోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్ అక్కడ యూరియా స్టాకు, విక్రయాల రిజిస్టర్‌ను పరిశీలించారు. యూరియా ఎమ్మార్పీకే విక్రయిస్తున్నారా, రైతులకు బిల్లులు ఇస్తున్నారా అనే అంశాలపై తనిఖీ చేశారు. యూరియా విక్రయాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న యూరియాను పాసుపుస్తకాలు తీసుకొచ్చిన రైతులకు టోకెన్‌లు ఇచ్చి విక్రయించాలని సూచించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ యూరియా విక్రయాల్లో ప్రైవేటు ఎరువుల దుకాణదారులు, రైతు సేవా కేంద్రంలో వీఏఏలు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కూడా అవసరానికి మంచి యూరియా వినియోగించకుండా వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, వీఏఏ పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఒకే డీఎస్సీలో మూడు పోస్టులు

- జిల్లాకు చెందిన ఉదయ్‌కుమార్ ప్రతిభ



మదనపల్లె టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఒక పోస్టు సాధించడమే గగనం అన్న తరుణంలో ఏకంగా ఒకే డీఎస్సీలో మూడు పోస్టులు సాధించిన ఘనత ఉదయ్‌కుమార్ దక్కించుకున్నారు. ములకలచెరువు మండలం దండువారిపల్లెకు చెందిన జయమ్మ కుమారుడు డి.ఉదయ్‌కుమార్ 2005 సంవత్సరంలో ఎమ్మెస్సీ మ్యాథ్స్ పూర్తి చేసి 2012 సంవత్సరంలో బీఈడీ పూర్తి చేశారు. 2018లో డీఎస్సీలో పరీక్ష రాసినా 1.5 మార్కుల తక్కువతో ఉద్యోగం సాధించలేకపోయారు. ఈ క్రమంలో 2025లో నిర్వహించిన మెగా డీఎస్సీలో పీజీటీ (పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్)లో జోన్-4 స్థాయిలో 8వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 11వ ర్యాంకు, టీజీటీ (ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్) స్థాయిలో 40వ ర్యాంకు సాధించారు. పట్టణంలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఉదయ్‌కుమార్ మూడు పోస్టులు సాధించగా అవకాశం వస్తే స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు.

గోళ్లపల్లె వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరి మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు


సాయిప్రతాప్ (ఫైల్)


శ్రీనివాసులు (ఫైల్)


ఘటనా స్థలాన్ని పరిశీస్తున్న సీఐ గోపాల్‌రెడ్డి

బి.కొత్తకోట/మదనపల్లె అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు-మదనపల్లి జాతీయ రహదారిపై బి.కొత్తకోట మండలం గోళ్లపల్లి సమీపంలోని బోడిగుట్టవద్ద శనివారం తెల్లవారు ఝామున ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మదనపల్లెకు చెందిన ఓ వ్యక్తి ములకలచెరువు మార్కెట్‌యార్డ్‌లో ఎస్వీఎస్ టమోటా మండీ నిర్వహిస్తున్నాడు. ఇతని మండీలో పలువురు పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక మండీ యజమాని తన ఇన్నోవాలో మదనపల్లెకు బయలుదేరాడు. అతడిని మదనపల్లెలో వదిలి వాహనం తిరిగి ములకలచెరువుకు వచ్చింది. టమోటాల పని ముగించుకుని మండీ రైటర్, మరో ఆరుగురు మళ్లీ మదనపల్లికి బయలుదేరారు. వాహనం వేగంగా వెళుతుండగా గోళ్లపల్లె వద్ద కారు టైర్ పగిలిపోయింది. దీంతో ఇన్నోవా అదుపుతప్పి ఓ పక్కకు బోల్తాకొట్టింది. అతివేగంతో ఒక్కసారిగా బోల్తాపడడంతో ముందుభాగం అంతా నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో మదనపల్లెలోని టీకేపల్లికి చెందిన డ్రైవర్ శ్రీనివాసులు (49), అమ్మచెరువుమిట్టలో కాపురం ఉంటూ ములకలచెరువు టమోటామండీలో రైటర్‌గా పనిచేస్తున్న సాయిప్రతాప్ (22) అక్కడికక్కడే మృతి చెందారు. రైటర్ సాయిప్రతాప్ స్వస్థలం రాయచోటి. కాగా వాహనంలో ఉన్న మిగతా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన సమాచారం అందగానే సీఐ గోపాల్‌రెడ్డి తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కురబలకోట మండల 108 సిబ్బంది బావాజాన్, మస్తాన్ సాయంతో క్షతగాత్రులను మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా గాయపడిన వారిలో నిజామ్, మహబూబ్‌బాషా, షేక్ సుహేల్, ఆస్రఫ్, పఠాన్ ఖాదర్‌ఖాన్‌లు ఉన్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపాల్‌రెడ్డి తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న పవిత్ర

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గుర్రంకొండ మండలం, చెర్లోపల్లెలో చోటు చేసుకుంది. శనివారం ఉదయం కడుపునొప్పి ఎక్కువగా రావడంతో తట్టుకోలేక పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు గుర్రంకొండ మండలం, చెర్లోపల్లెకు చెందిన శివ భార్య పవిత్ర (26) పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

ఐదుగురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాల వద్ద దారి విషయమై జరిగిన ఘర్షణలో ముగ్గురు గాయపడడంతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అగ్రహారం పంచాయతీ రెడ్డివారిపల్లి వాసి గుల్ల శ్రీనివాసులురెడ్డి తన పొలం వద్ద దారి సమస్య కారణంగా జరిగిన ఘర్షణలో అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డిని ఆయన భార్య యమున, చెల్లెలు సుజాతపై భాస్కర్‌రెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, క్రిష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారు. దీంతో శ్రీనివాసులురెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

చుక్కలు చూపిన ఏడుకొండలు ఎక్స్‌ప్రెస్

ఐదు గంటలు ఆలస్యంతో ప్రయాణికుల అసహనం



ములకలచెరువు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే ఏడు కొండలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం ప్రయాణికులకు చుక్కలు చూపించింది. ఐదు గంటల పాటు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు గుర్రై తీవ్ర అవస్థలు పడ్డారు. సాంకేతిక కారణాలతో సికింద్రాబాద్ జంక్షన్‌లో రైలు నాలుగున్నర గంటలకుపైగా ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సిన రైలు ఉదయం 7.49 గంటలకు వచ్చింది. అలాగే మదనపల్లె రోడ్‌కు తెల్లవారుజామున 3.18 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 8.16 గంటలకు, కలికిరికి తెల్లవారుజామున 3.49 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 8.41 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు వెళ్లాల్సి ఉండగా 8.52 గంటకు వెళ్లింది. అలాగే ఉదయం 6.25 గంటలకు తిరుపతికి చేరాల్సిన రైలు ఉదయం 10.14 గంటలకు వెళ్లింది. రైలు తీవ్ర ఆలస్యంగా నడవడంతో రైల్వేస్టేషన్లలో రైలు కోసం గంటల తరబడిగా వేచి చూసి అసహనానికి గురయ్యారు.

ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు


కలెక్టర్ నుంచి స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులు

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులకు శనివారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ స్కాలర్‌షిప్‌లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో క్రెడిట్ యాక్సెస్ ఇండియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మదనపల్లెకు ఏ. పూజిత, ములకలచెరువుకు చెందిన పీ. తేజస్విని , చౌడేపల్లి కి చెందిన బీ. రెడ్డిరాణి, కదిరికి చెందిన ఎస్. సాధక్, బీ. కొత్తకోటకు చెందిన పీ. పల్లవి ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ తరపున డివిజనల్ మేనేజర్ జగదీశ్, ఏరియా మేనేజర్ హనుమంతయ్య, సుంకన్న, బ్రాంచ్ మేనేజర్ మదుసూధన్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఏపీ లిక్విడ్ స్ప్రేతో మంచి దిగుబడులు

జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ


రైతులకు వేప మొక్కలను అందజేస్తున్న జేడీఏ శివనారాయణ

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పైరుకు డీఏపీ చల్లకుండా లిక్విడ్‌తో స్ప్రే చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివనారాయణ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనివారం బీ.యర్రగుడి పంచాయతీలోని చెంచర్లపల్లి, యర్రగుడి, మామిడిగారిపల్లెల్లోని వేరుశనగ, కంది, ఆముదం పంటలకు డీఏపీ లిక్విడ్ స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విస్కో కంపెనీ వారు డీఏపీని స్ప్రేగా విక్రయిస్తున్నారని, దీనిని ప్రతి రైతు ఉపయోగించుకోవచ్చునన్నారు. వేరుశనగ, ఆముదం, కంది, వరి, ఇతర పైర్లకు డీఏపీ లిక్విడ్ స్ప్రే చేసుకోవచ్చునన్నారు. రైతు పొలం గట్టున మొక్కలు నాటుకుంటే ఎంతో ఉపయోగకరమని 200 వేప మొక్కలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జయరాణి, ఏవో రాజాకుమారి, ఏఈవో అనూష, ఆర్‌ఎస్ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వరికోత యంత్రం బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

బి.కొత్తకోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తుమ్మణంగుట్ట సమీప జాతీయ రహదారిపై వెళుతున్న వరికోత యంత్రం బోల్తాపడింది. శనివారం సాయంత్రం వెళుతున్న యంత్రం పైనుంచి 15 అడుగుల కిందికి రోడ్డుపైకి పడిపోవడంతో డ్రైవర్ గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108కు సమాచారం అందించి మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం జగన్ కాలనీకి చెందిన మంగమ్మ మిద్దెపై దుస్తులు ఆరవేస్తూ శనివారం కిందపడింది. దీంతో తలకు గాయమై స్పృహ కోల్పోయింది. వెంటనే కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్సను అందించిన డాక్టరు ఆమె పరిస్థితి విషమంగా ఉందని ఎక్కడికైనా తీసుకెళ్లాలని చెప్పారు. అయితే వారి ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో ఇక్కడ ఐసీయూలోనే ఉంచారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

కొత్తగా.. పరీక్షలు

- ప్రశ్నపత్రాల స్థానంలో బుక్‌లెట్లు
- నూతన విధానానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం
- ఒత్తిడి తగ్గించాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిర్ణయాల వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. విద్యార్థులకు కనీసం ప్రశ్నపత్రాలు అందించలేని దుస్థితి నెలకొంది. ఉపాధ్యాయులు బోర్డులపై ప్రశ్నలు రాస్తే వాటిని విద్యార్థులు ఎక్కించుకుని పరీక్షలు రాసేవారు. కనీసం సుద్దముక్కకు కూడా డబ్బులు ఇవ్వని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి భిన్నంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుడుతోంది. ప్రశ్నపత్రాల స్థానంలో బుక్‌లెట్లు ప్రవేశపెట్టింది. అయితే ఈ విధానంతో తమకు పనిభారం పెరిగి బోధన సమయం తగ్గిపోతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ప్రశ్న సమాధాన పత్రాలకు స్వస్తి పలికి బుక్‌లెట్ విధానాన్ని తీసుకొచ్చింది. ప్రతి సబ్జెక్టుకు స్టూడెంట్ అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను ప్రవేశపెట్టింది. 1 నుంచి 10వ తరగతి వరకు నూతన పరీక్ష విధానాన్ని అమలు చేస్తున్నారు. పరీక్షలన్నీ బుక్‌లెట్‌లోనే రాయాలి. ప్రశ్నలు, జవాబులకు సరిపడా బుక్‌లెట్‌లో పేజీలు కేటాయించింది. సోషల్‌కు మ్యాపులు, గణితానికి గ్రాఫ్‌లు, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు సంబంధించిన ఓఎంఆర్ షీటు అన్నీ అందులోనే ఉంటాయి. విద్యార్థుల అపార్ ఐడి నెంబర్, పూర్తి వివరాలు, ప్రశ్నపత్రం కోడ్, పరీక్ష సమయం అందులో ఉంటాయి. ఎఫ్‌ఏలు నాలుగు, ఎస్‌ఏలు రెండు పరీక్షల తేదీలతో పాటు బుక్‌లెట్‌లో ఉంటాయి. ఈ బుక్‌లెట్ ఆధారంగా విద్యార్థుల ప్రగతి సామర్థ్యాన్ని ఉన్నతాధికారులు అంచనా వేస్తారు. దీనిని బట్టి విద్యార్థులకు ఏ బీ సీ డీ కేటగిరీలు కేటాయిస్తారు. నూతనంగా ప్రవేశపెట్టిన పరీక్ష విధానాన్ని ఉపాధ్యాయులు స్వాగతిస్తూనే పని ఒత్తిడి తగ్గించాలని కోరుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రవేశపెట్టిన పరీక్ష విధానం బాగుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

బుక్‌లెట్‌తో మంచి ఫలితాలు రావు



పరీక్షల నిర్వహణలో మూల్యాంకన పుస్తకం అనే విధానం కొత్త సమస్యలకు దారితీస్తుంది. దీని వలన పాఠశాల పనివేళలో బోధన సమయాన్ని హరించే విధంగా ఉంది. దీనితో పాఠశాలలో మూల్యాంకనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడి బోధనా సమయానికి అంతరాయం ఏర్పడుతుంది. మార్కుల నమోదు, ఆన్‌లైన్ నమోదు, రిజిస్టర్ల నమోదుతో పాటు బబ్లింగ్ చేసే పనికూడా ఉపాధ్యాయులకు ఇచ్చారు. ఉపాధ్యాయునికి ఈ విధానం కష్టమవుతుంది.

- టి.ఖాదర్‌బాషా, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

పరీక్షలు విద్యార్థులకా? ఉపాధ్యాయులకా?



ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు విద్యార్థులకో లేక ఉపాధ్యాయులకో అర్థం కావడం లేదు. ప్రతి విద్యార్థికి సంబంధించిన అంశాలను ఉపాధ్యాయుడే రాయాలని చెప్పడం వలన పరీక్షలు ముగిసిన తర్వాత రోజుల తరబడి మూల్యాంకనం చేసుకోవడానికే సమయం సరిపోతుంది. దీని వలన బోధన అటకెక్కే పరిస్థితి ఏర్పడింది. పరీక్ష పత్రాలన్నీ స్కాన్ చేసి అప్‌లోడ్ చేయమనడం వల్ల ఇప్పటికే అనేక బోధనేతర కార్యక్రమాలతో సతమతమవుతున్న ఉపాధ్యాయులకు ఇది మరింత భారంగా మారింది.

- పాలెం మహేశ్‌బాబు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

గురువుపై దిద్దుబాటు బరువు



ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెస్తున్నా కొన్ని అంశాలు ఉపాధ్యాయులకు మరికొన్ని అంశాలు విద్యార్థులకు ఇబ్బంది కలిగించేలా ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరీక్ష విధానంలో విద్యార్థుల స్థాయికి మించిన ప్రశ్నలు ఇచ్చారు. విద్యార్థుల జవాబు పత్రం మూల్యాంకనం చేసి వాటి మార్కులను ఓఎంఆర్ షీట్‌లో బబ్లింగ్ చేసే విధంగా ఉపాధ్యాయులకు పనిపెట్టడం చాలా ఇబ్బందిగా ఉంది. ఈ విధానం మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలి.

- ఎస్.రామాంజనేయులు, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

పని విభజన సర్దుబాటు చేయాలి



విద్యాశాఖలో జరుగుతున్న సంస్కరణలతో పాటు పని విభజనను కూడా సర్దుబాటు జరగాలి. అసెస్‌మెంట్ బుక్‌ల ద్వారా పరీక్షలు, మూల్యాంకనంతో పనిభారం ఎక్కువైంది. తదనుగుణంగా పరీక్షలు, మూల్యాంకనం, బోధన, సిలబస్‌పై కూలంకుషంగా చర్చించి పని రోజుల సంఖ్యను విభజించాలి. ఉపాధ్యాయులు ఆన్‌లైన్ చేస్తున్నప్పుడు ఆఫ్‌లైన్‌ను రద్దుచేయాలి. అసెస్‌మెంట్ పుస్తకాలతో పరీక్షల విధానాన్ని పునఃసమీక్షించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు


ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి : కలెక్టర్


స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలో కలెక్టర్ శ్రీధర్

కలకడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులకు సూచించారు. శనివారం కలకడలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమం ప్రతి నెలా మూడవ శనివారం జిల్లా వ్యాప్తంగా జరుగుతుందన్నారు. గత మాసాంతం నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున జనావాసాల పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, జ్వరాలు ప్రబలడంతో పాటు అంటువ్యాధులు సోకే ప్రమాదముందన్నారు. వీటి నివారణ చర్యల్లో భాగంగా ప్రతి పంచాయతీ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీలు, పంచాయతీ సచివాలయాలు, పారిశుధ్య సిబ్బంది సమిష్టిగా ప్రతి శుక్రవారం ప్రజలు డ్రైడే పాటించేలా కృషి చేయాలన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని తెలిపారు. అనంతరం బస్టాండు వద్ద ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. కాగా జాతీయ రహదారి పక్కనే మురికినీటి నిల్వను గమనించిన కలెక్టర్ స్వయంగా స్ప్రే చేసి పంచాయితీరాజ్ శాఖాధికారులు, కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి దయాకర్‌రెడ్డి, తహశీల్దార్ మహేశ్వరిబాయి, ఎంపీడీవో జగదీశ్వర్, ప్రతాప్‌రెడ్డి, ఏపీవో సుజాత, సర్పంచ్ విశ్వనాథ్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్నానికే సబ్ కలెక్టరేట్ ఖాళీ

- మధ్యాహ్నం 3 గంటలకు సీట్లన్నీ ఖాళీ
- పనుల కోసం వచ్చిన ప్రజల బేజారు


మధ్యాహ్నం 3 గంటకు ఖాళీగా కనిపిస్తున్న సబ్‌కలెక్టరేట్

మదనపల్లె టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సబ్‌కలెక్టరేట్ కార్యాలయం 11 మండలాలు, 10 లక్షల మంది ప్రజలకు రెవెన్యూ సేవలందిస్తుంటుంది. అటువంటి ఈ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు విధి నిర్వహణలో సమయపాలన పాటించడం లేదు. వివిధ రెవెన్యూ సేవల కోసం వచ్చే ప్రజలకు ఇక్కడి ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైల్స్ దహనం జరిగనప్పటి నుంచీ ఇక్కడి ఉద్యోగులు పనివేళల్లో, వాచ్‌మెన్‌లు, సెక్యూరిటీ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. కానీ శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సబ్‌కలెక్టరేట్‌లో ఉద్యోగుల సీట్లన్నీ ఖాళీగా కనిపించాయి. కార్యాలయంలోకి ఎవరు వెళ్లినా అక్కడ సమాధానం ఇచ్చేవారు లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మినిస్టీరియల్ ఉద్యోగులు ఉదయం 10 గంటలకు విధులకు హాజరు కావాల్సి ఉంది. వీరు వచ్చిన వెంటనే బయోమెట్రిక్ హాజరు వేసుకుని, సాయంత్రం 5.30 గంటల వరకు విధులు నిర్వహించాల్సి వుంది. మధ్యలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల లోపు ఎప్పుడైనా అరగంట పాటు భోజన విరామం ఉంటుంది. ఇది ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మినిస్టీరియల్ సిబ్బంది విధిగా అమలు చేయాల్సిన నిబంధన. కానీ మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో మాత్రం కొందరు ఉద్యోగులు వారికి ఇష్టమొచ్చినప్పుడు రావడం, టీలకు, భోజనాలకు అంటూ సమయపాలన మరిచి బయటకు వెళుతున్నారు.

కనీసం వీరి సీట్లను వదలి వెళ్లేటప్పుడు విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు కూడా ఆఫ్ చేయకుండా వెళ్లిపోతున్నారు. ఇది వారి నిర్లక్ష్యానికి తార్కాణమనే చెప్పవచ్చు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న సబ్‌కలెక్టర్ కళ్యాణి సబ్‌కలెక్టరేట్ ఉద్యోగులను ఒక గాడిన పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై సబ్‌కలెక్టర్ కళ్యాణి వివరణ ఇస్తూ ఇక్కడి ఉద్యోగులు మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు భోజనానికి వెళ్లి ఉండవచ్చని, కొందరు తనతో పాటు రాయచోటిలో ఆర్బిట్రేషన్ కేసుల విషయమై వచ్చారని చెప్పారు.

వచ్చే ఏడాది మెడికల్ కాలేజి ప్రారంభించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్లు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల నిర్మాణం ఆగింది కాసుల కోసమేనని, 2026 సంవత్సరానికి కాలేజి ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మదనపల్లెలో కొత్తగా నిర్మాణం చేపట్టిన మెడికల్ కళాశాల భవనాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2022లో వైసీపీ ప్రభుత్వంలో కొత్త మెడికల్ కళాశాలలు మదనపల్లె, ఆదోని, మార్కాపురం, పులివెందులలో అగ్రిమెంట్ చేసుకుందన్నారు. ఇందులో భాగంగా మదనపల్లె రూ.472 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. పనులు ఆలస్యం కావడంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.12 కోట్లతో తాత్కాలిక భవనాలకు నిధులు మంజూరు చేశారు. ఇందులో రూ.7 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపినా అందులో కనీసం కోటి రూపాయల విలువైన పనులు కూడా జరగలేదని ఆరోపించారు. గతంలో పనులు మెగా కంపెనీకి కేటాయించగా రెండు కళాశాలల భవనాలు ప్రారంభించారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో నిర్మాణాలు ఆపేశారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది బదిలీ చేసి మదనపల్లె ప్రజల ఆశలపై నీళ్లు చల్లారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు హరిశర్మ, శ్రీరాములు, రామమూర్తి, రాజు, కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై దాడులు


యూరియా నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో ఎరువుల దుకాణాలపై వ్యవసాయ, ఉద్యానశాఖ సంయుక్తంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాజేంద్రప్రసాద్, గీతావాణి తనిఖీలు నిర్వహించారు. యూరియా నిల్వ ఉంచిన గోడౌన్‌ను పరిశీలించారు. యూరియా కొరత లేకుండా చూసుకోవాలని, అందుకు సంబంధించిన యూరియా నిల్వలను ఉంచాలని ఎరువుల దుకాణం యజమానులకు తెలియజేశారు. ఎరువుల అమ్మకాలు వాటి సంబంధించిన రసీదులను పరిశీలించారు. అక్రమంగా యూరియా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సురేశ్, పీసీ సుధాకర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ చేసిన సబ్ కలెక్టర్


రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ భావన

రాజంపేట టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణం రైల్వేకోడూరు రోడ్డులోని ఎరువుల దుకాణాన్ని శనివారం సబ్‌కలెక్టర్ హెచ్‌ఎస్ భావన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు వివరాలను పరిశీలించారు. నిర్ణయించిన ధరల మేరకే ఎరువులను అందజేయాలని అలా కాకుండా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పీరుమున్నీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో...

నందలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో శనివారం డిప్యూటీ తహసీల్దారు మోహన్‌కృష్ణ, మండల వ్యవసాయాధికారి మల్లికార్జున తనిఖీలు చేశారు. యూరియాను నిర్ధేశిత ధరకే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెరగాలి

రాయచోటిటౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష పరిశోధనలో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా ఎదగడం భారతీయులందరికీ గర్వకారణమని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శనివారం డైట్ ప్రాంగణంలో డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 ఆగస్టు 23న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ శివశక్తి అనే ప్రదేశంలో సురక్షితంగా దిగిందన్నారు.

ఈ విజయాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఆగస్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సవంగా నిర్ణయించిందన్నారు. అంతరిక్ష ప్రయోగాలపై పిల్లలు, యువతలో ఆసక్తి పెంపొందించడానికి విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇస్రో యువిక (యంగ్ సైంటిస్ట్)- 2025 అనే కార్యక్రమం నిర్వహిస్తోందని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వ పోస్టర్ల తయారీ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు శివభాస్కర్, వైసీ రెడ్డెప్పరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గిరిబాబు యాదవ్, శివప్రసాద్, తిరుపతి శ్రీనివాస్, కేదార్నాథ్, మోహన్‌నాయక్, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

- ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

కడప, ఆగస్టు 23 : పులిపిర్లకు పడియార మల్లికార్జున అరుదైన చికిత్సనందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన, ఎస్.పి. బంగళా ఎదురుగా హరితా హోటల్ ఎ.పి. టూరిజం నందు, ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. ఆది, సోమవారం రెండురోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబరులో సంప్రదించాలన్నారు.

కూటమి ప్రభుత్వంలోనూ..

వైసీపీ నేతల భూకబ్జా

- మితిమీరుతున్న ఆక్రమణలు
- చోద్యం చూస్తున్న అధికారులు



కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ నేతలు భూ ఆక్రమణలకు తెగబడుతున్నారు. అడ్డు చెప్పేవారు లేకపోవడంతో వైసీపీ ఆక్రమణల పర్వం ఇంకా కొనసాగుతుంది. దీనికి అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల ద్వారా కొద్దో గొప్పో లబ్ధి పొందడం వల్ల స్వామిభక్తి చాటుకుంటున్నట్లు సమాచారం. అందుకే ఆక్రమణల గురించి తెలిసినా పట్టించుకోవడం లేదని చర్చ సాగుతుంది. ఎవరైనా ప్రజలు ఫిర్యాదు చేస్తే తప్ప రెవెన్యూ అధికారుల్లో చలనం కనిపించడం లేదనేది స్పష్టమవుతుంది. ఇటీవల కమలాపురం మండలంలో కూడా ప్రజలు ఫిర్యాదు చేసిన తరువాతనే అది ప్రభుత్వ భూమి అని, అక్కడ ఎవరూ ఆక్రమించుకోరాదు అంటూ ఒక బోర్డును పాతిపెట్టారు. అంతవరకు ఆ భూములు వైసీపీ నాయకులు తమ సొంత భూములుగా భావించి వనాలు తయారు చేసుకున్న పరిస్థితి. జిల్లాలో దాదాపు ప్రతి మండలంలో గత ప్రభుత్వ హయాంలో భూ ఆక్రమణలు జరిగాయన్నది బహిరంగ రహస్యమే. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఇవి అలాగే ఉన్నాయి. ప్రజలు ధైర్యం చేసి ఫిర్యాదు చేస్తే తప్ప ఆక్రమణదారుల కబంధ హస్తాల నుంచి భూములు బయటపడే పరిస్థితి లేదు.

ప్రభుత్వం మారినా..

ప్రభుత్వం మారినా వైసీపీ నాయకులు భూఆక్రమణలు కొనసాగిస్తూనే ఉన్నారు. కడప నగరంలో భూముల ధరలు భారీగా పెరిగిపోయాయి. దీంతో ఎక్కడ ఏ కొంత ఖాళీ జాగా కనిపించినా పాగా వేస్తున్నారు. కొంత మంది నకిలీ పత్రాలు తయారు చేసుకుని స్వాహా పర్వానికి తెరలేపుతున్నారు. తాజాగా కడప నగరంలోని మూడో డివిజన్‌లో వైసీపీ నాయకుడు ఒకరు ప్రభుత్వ భూమిలో భవనాల నిర్మాణం సాగిస్తున్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా ఏర్పడిన ఆర్‌కే నగర్ సమీపంలో ఇతర కాలనీలు వెలిశాయి. ఇక్కడ గతంలో కొంతమంది నిరుపేదలకు స్థలాలు కేటాయించారు. అందులో కొంతమంది గృహాలు నిర్మించుకోగా మరికొంత స్థలం ఖాళీగా ఉండేది. ఈ కళాశాల స్థలాల్లో వైసీపీ నాయకులు ప్రస్తుతం భవనాలను నిర్మాణం చేపడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో స్థలం పొందిన వారు వచ్చి అడ్డు చెబితే మీకు ఇచ్చిన స్థలాలు రద్దయిపోయాయి అంటూ బుకాయించడంతో పాటు దౌర్జన్యాలకు దిగి స్థలాలు ఆక్రమించుకుని భవనాలు నిర్మిస్తున్నట్లు సమాచారం.

కడప రింగు రోడ్డుకు ఆనుకుని ఉన్న బైపాస్ రోడ్డు పక్కన ఉన్న ప్రాంతంలో పేదల కాలనీలో గల ప్రభుత్వ స్థలం కొంత స్థలం ఆక్రమించి యథేచ్ఛగా బిల్డింగులు నిర్మిస్తున్నారు. దీనికి కొందరు రెవెన్యూ సిబ్బంది సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జగన్ ప్రభుత్వంలో భూ ఆక్రమణలు, భూ కబ్జాలతో ప్రజలు విసిగిపోయారు. దీంతో ప్రజలు వైసీపీకి తగిన బుద్ధి చెప్పారు. కూటమికి జై కొట్టారు. ఈ ప్రభుత్వంలో కూడా వైసీపీ నాయకులు ఏ మాత్రం తగ్గకుండా యథేచ్ఛగా ప్రభుత్వ భూములు ఆక్రమించి బిల్డింగులు నిర్మిస్తున్నా అధికారుల్లో చలనం కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మరికొంత మంది అధికారులు మామూళ్ల మత్తులో ప్రజల భూములను భూఆక్రమణదారులకు ధారాదత్తం చేస్తున్నట్లు సమాచారం. మరికొంత మంది రెవెన్యూ సిబ్బంది భవిష్యత్తులో ప్రభుత్వం మారితే తమను ఇబ్బంది పెడతారేమో అనే భయంతో పట్టించుకోకుండా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే చర్చ సాగుతుంది. ఈ పరిస్థితుల్లో రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టి భూ ఆక్రమణదారుల కబంధ హస్తాల నుంచి ఆక్రమిత భూములు కాపాడాలని కోరుతున్నారు. అదేవిధంగా కడప నగరం మూడో డివిజనులోని పేదల కాలనీలో అక్రమంగా వైసీపీ నాయకులు ఆక్రమించి నిర్మాణం చేస్తున్న భవనాలను కూల్చి ప్రభుత్వ భూమికి కంచెను ఏర్పాటు చేసి బోర్డు పెట్టవలసిందిగా ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కడప తహసీల్దారును ఆంధ్రజ్యోతి వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



ఆక్రమణదారులు నిర్మిస్తున్న గృహాలు

మెడికల్ ఏజన్సీ నిర్వాహకుడిపై కేసు నమోదు

ముద్దనూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ మెడికల్ ఏజన్సీ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీఐ దస్తగిరి వివరాల మేరకు.. నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఉప్పలూరు గ్రామానికి చెందిన పరమేశ్వరరెడ్డి దాదాపు 4 ఏళ్లుగా ఆరోగ్య మెడినీడ్స్ మెడికల్ ఏజన్సీ నడుపుతున్నాడు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలో మెడికల్ షాపు యజమాని పెనుజారి శ్రీధర్‌కు మెడిసిన్ పంపిణీ చేస్తానని రూ.99 లక్షలు తీసుకున్నాడు. రూ.3లక్షలకు మెడిసిన్ పంపించగా, మిగిలిన రూ.96లక్షలకు ఇవ్వాల్సి ఉంది. బాధితుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేశామని, ఏజన్సీ నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఏజెన్సీ నిర్వాహకుడు అనంతపురం, ప్రొద్దుటూరు, కడప ప్రాంతాల్లోని కొన్ని మెడికల్ ఏజన్సీల నుంచి మందులను తెచ్చి జమ్మలమడుగు, కోవెలకుంట్ల ఇతర ప్రాంతాల్లోని మెడికల్ షాపులకు మందులు విక్రయించేవాడని, మెడికల్ షాపు చూపిస్తూ చాలా మంది వద్ద డబ్బులు అప్పు తీసుకున్నట్లు సమాచారం. అప్పు ఇప్పించిన మధ్యవర్తులకు నూటికి రూ.20 కమీషన్ ఇచ్చేవాడని, మధ్యవర్తుల ద్వారా కోట్లు అప్పు తీసుకున్నట్లు తెలిసింది. 10 రోజుల నుంచి ఏజన్సీ నిర్వాహకుడు కనిపించకుండా పోయాడని, మొబైల్ కూడా ఇంట్లో పెట్టి వెళ్లినట్లు సమాచారం. దీంతో అప్పులు ఇచ్చిన వారిలో ఆందోళన రేగుతోంది.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి పవిత్రోత్సవాలు ఈ నెల 24 నుంచి 26వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం అంకురార్పణ చేశారు. సాయంత్రం 6 గంటలకు మేదిని పూజ, అంకురార్పణ ఘట్టాలు నిర్వహించారు. యాత్రికుల వల్ల కాని, సిబ్బంది వల్ల కాని తెలియక జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానివ్వకుండా నిర్వహించేందుకు ప్రతి ఏడాది మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తూ ఉంటారు. ఈనెల 24న యాగశాలలో పవిత్ర ప్రతిష్ఠ, 25న పవిత్ర సమర్పణ, 26న వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ అధికారి హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, అర్చకులు వీణారాఘవాచార్యులు, శ్రావణకుమార్, మనోజ్‌కుమార్, పవన్‌కుమార్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభలవీడులో భూమి విషయమై ఘర్షణ



బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు సిద్దారెడ్డి

బి.కోడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభలవీడు గ్రామం సర్వేనెం.895 భూమి విషయమై వైసీపీ నాయకులు టీడీపీ నాయకుడు సిద్దారెడ్డిపై శనివారం సాయంత్రం మూకుమ్మడి చేశారని బాధితుడు తెలిపారు. ప్రభలవీడు గ్రామ రెవెన్యూ పొలంలో సర్వేనెం.895 భూమిలో శ్మశానానికి, వైసీపీ నాయకులకు, టీడీపీ నేత సిద్దారెడ్డి సోదరికి భూములు ఉన్నాయి. కాగా శనివారం వైసీపీ నాయకులు వారి పొలానికి సర్వే చేయిస్తుండగా టీడీపీ నేత సోదరి అక్కడికి వెళ్లడంతో వైసీపీ నాయకులు సిద్దారెడ్డితో ఘర్షణ పడి దాడికి పాల్పడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. వైసీపీకి చెందిన నాయకులు నాగిరెడ్డి సుబ్బిరెడ్డి, సుబ్బలక్షుమ్మ, జయమ్మ, లక్ష్మీదేవిలు కలిసి తనపై విచక్షణారహితంగా దాడి చేశారని, తనను గ్రామస్థులు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి చేర్చారన్నారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు వెళ్లినట్లు బాధితుడు తెలిపారు. కాగా ఈ విషయమై బీకోడూరు ఎస్ఐ వెంకటసురేశ్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సిద్దారెడ్డి తెలిపారు.

నేడు గంధం మహోత్సవం

కడప కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా ప్రసిద్ధిగాంచిన కడప అమీన్‌పీర్ దర్గాలో ఆదివారం గంధం మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 10వ పీఠాధిపతి హజరత్ ఖాజా సయ్యద్‌షా అమీనుల్లా మహ్మద్ మహ్మదుల్ హుసేని చిష్టివుల్ ఖాద్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేస్తున్నట్లు తెలియజేశారు. 25న తహలీల్‌తో పాటు ఉరుసు రోజున ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. అన్నివర్గాల ప్రజలు గంధం, ఉరుసు మహోత్సవాలు విజయవంతం చేసేందుకు తరలిరావాలని కోరారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

- 26 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీకేదిన్నె మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేశారు. కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం శుక్రవారం సాయంత్రం నుంచి సీకే దిన్నె మండలంలోని మద్దిమడుగు ఫారెస్టు సెక్షన్‌లో స్థానిక అటవీ సిబ్బంది షకీల్ అహ్మద్, నారాయణరెడ్డితో కలిసి కూంబింగ్ చేపట్టారు. కోలుములపల్లి సమీపంలో కొంతమంది కారుతో కనిపించారు. చుట్టుముట్టేందుకు ప్రయత్నించగా కొందరు పారిపోగా, ముగ్గురు దొరికారు. పరిసర ప్రాంతాల్లో 26 ఎర్రచందనం దుంగలు లభించాయి. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను, కారును తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సెంచురీ ప్యానల్స్ పరిశ్రమ తనిఖీ



కెమికల్స్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో

గోపవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇండస్ట్రియల్ పార్కు వద్ద నిర్మించిన సెంచురీ ప్యానల్స్ పరిశ్రమను శనివారం ఆర్డీవో చంద్రమోహన్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వారు వాడే పదార్థాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపవరం తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, అగ్రికల్చర్ ఏడీతో పాటు బద్వేలు ఎంఈవో సెంచురీ ప్యానల్‌ను సందర్శించి వివరించారు. పరిశ్రమలోని హెచ్‌పీఎల్ ఎండీఎస్ ప్లాంట్లను సందర్శించారు. పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



భానుప్రకాష్ (ఫైల్)

లింగాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి భానుప్రకాష్ (22) శనివారం నంద్యాల జిల్లా పాణ్యం ఇంజనీరింగ్ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కుమారుడు ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లిదండ్రులు రాంభూపాల్, సరస్వతిలు తల్లడిల్లిపోతున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

కడప క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం దేవునికడపకు చెందిన యల్లనూరు ప్రనుష్‌కుమార్‌రెడ్డి (14) శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై కూర్చుని ఉండగా వేగంగా వస్తున్న మరో వాహనం ఢీకొనడంతో ఆ బాలుడు బ్రిడ్జి మీద నుంచి నీటిలో పడి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, మృతుడి తండ్రి నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

రూ.45 కోట్లతో మఠం అభివృద్ధికి శ్రీకారం: ఎమ్మెల్యే



కమిషనరుతో కలిసి మఠం ఆవరణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానకర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి వహించిన దేవస్థానాన్ని రూ.45 కోట్ల నిధులతో త్వరలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శనివారం మఠం దేవస్థానాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం తీర్థయాత్ర పునరుజ్జీవనం ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి డ్రైవ్ (ప్రసాదం) కేంద్ర ప్రయోజిత పథకం కింద నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మఠాన్ని ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, తాత్విక, సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆలయ ప్రాంగణంలో ముఖ్యంగా వెయ్యిమంది భక్తులు బస చేసేందుకు పెద్ద ఏర్పాటు చేస్తామని, రోడ్డు వెడల్పు, డ్రైనేజీ ఏర్పాటు, పోలేరమ్మ గుడి, కక్కయ్య గుడి అభివృద్ధి, బ్రహ్మంగారి నివాసం వీధి, రచ్చబండ, అలాగే వేదపాఠశాల, బి.మఠం దేవస్థానం ఆలయం చుట్టూ లైటింగ్ మాడవీదులుగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనరు రామచంద్రమోహన్, డిప్యూటీ కమిషనరు పట్టెం గురుప్రసాద్ కలిసి మఠంలో ఇప్పటివరకు నూతనంగా నిర్మాణం చేపట్టిన కళ్యాణ మండపం, డార్మిటరీ భవనాలను పరిశీలించారు. త్వరలోనే అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనరు మల్లిఖార్జునప్రసాద్, దేవదాయశాఖ అధికారి శంకరబాలాజీ, మేనేజరు ఈశ్వరాచారి, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, సర్పంచ్ నారాయణ, మేకల సుధాకర్, మల్లె బాలక్రిష్ణ, శీలం నరసింహగౌడ్, బాలగౌడ్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై విద్యార్థులకు క్విజ్ పోటీలు

- అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవిబాబు



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవిబాబు

కడప కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖలు సంయుక్తంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థులు ప్రథమ బహుమతిని దక్కించుకున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన క్విజ్ పోటీలను కడపలోని బాలికల జూనియర్ కళాశాలలో జరిగాయి. క్విజ్ పోటీల అనంతరం జిల్లా అదనపు డీఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణపై దేశ వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జనాభాలో హెచ్ఐవీ, సుఖ వ్యాధులు గురించి పరిజ్ఞానం, అవగాహన పెంపొందించడానికి, సురక్ష పద్ధతులు పాటించడం, వివక్ష అనే అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో స్వచ్ఛందంగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించుకొనేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విజేతలను రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపడం జరుగుతోందన్నారు. శనివారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో జమ్మల మడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థికి ప్రథమ బహుమతి రాగా రెండవ బహుమతి యర్రగుంట్ల జూనియర్ కళాశాలకు, తృతీయ బహుమతి పులివెందుల వైఎస్ వీఆర్ఎం కళాశాల విద్యార్థులకు లభించాయి. విజేతలందరికీ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నగదు బహుమతి వారి సొంత ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రోగ్రాం మేనేజరు భాస్కర్, వీవీ ప్రసాద్, సాధిక్, సిలార్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు

- అధిక యూరియాతో పంటకు నష్టం
- జేడీఏ చంద్రానాయక్

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువులు పక్కదారి పట్టకుండా పటిష్టమైన నిఘా, ఆకస్మిక దాడుల కోసం జిల్లా వ్యాప్తంగా ఎనిమిది ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు చంద్రానాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన 70 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు పక్కదారి పట్టకుండా రైతన్నకు అందేలా అన్ని రకాల పటిష్ఠమైన గట్టి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో ఎనిమిది వ్యవసాయ శాఖ డివిజన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌కు ఒక ప్రత్యేక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో వ్యవసాయ శాఖ నుంచి ఏడీఏ, పోలీసు శాఖ నుంచి ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ శాఖ నుంచి పీటీవో స్థాయి అధికారులతోపాటు టెక్నికల్ ఏవో, స్థానిక వ్యవసాయ శాఖ అధికారి ఉంటారని వివరించారు. వీరు ఎరువుల దుకాణాలపై ప్రత్యేక నిఘాతో పాటు మెరుపు దాడులు చేసేలా ప్రణాళికను తయారు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 20 శాతం మాత్రమే ఖరీఫ్ సీజన్‌లో సాగైనట్లు ఈ-పంట గణాంకాలు చెబుతున్నాయన్నారు. వర్షాలు ఇప్పుడిప్పుడే పడడంతో రైతన్నలు సాగుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిత, త్రీటౌన్ సీఐ వేణుగోపాల్, బీసీటీవో ఖాజామొయిద్దీన్, ఏవో వరహరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారుల బృందం

ప్రొద్దుటూరు పట్టణంలోని ఎరువుల దుకాణంపై శనివారం సాయంత్రం విజిలెన్స్ అధికారుల బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. స్థానిక ఎరువులు, డీలర్ల దుకాణాల్లో స్టాక్ నిలువలు, రికార్డులను తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ జేడీఏ చంద్రానాయక్ నేతృత్వంలో ఏడీఏ అనిత, ఎ.వేణుగోపాల్, డీసీటీవో ఖాజామొద్దీన్, ఏవో వరహరికుమార్‌ల బృందం పట్టణంలోని మహాలక్ష్మి ఫర్టిలైజర్స్, కేవీఎస్ఆర్ హోల్‌సేల్ ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఇన్‌వాయిస్‌లు పరిశీలించారు. కమర్షియల్ ట్యాక్స్ అధికారులు దుకాణ క్రయవిక్రయాలను తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలని తేల్చిచెప్పారు. యూరియాతో పాటు ఏ ఇతర వస్తువుల కొనుగోలుపై రైతులను ఒత్తిడి చేయకూడదని వివరించారు.

సమష్టి కృషితో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సాకారం

రాజంపేట టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సమష్టిగా పని చేసి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రను సాధిద్దామని సబ్‌కలెక్టర్ ఎస్‌హెచ్ భావన పిలుపునిచ్చారు. శనివారం రాజంపేట మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ శుభ్రతపై ప్రతి ఒక్కరి లోను మార్పు రావాలన్నారు. అవినీతి నిర్మూలనలో ప్రజలు, అధి కారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి వీధికి చెత్త వాహనాలు వస్తున్నాయని, ఇంటి లోని తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్తబండి వారికి ఇవ్వాలని తెలి పారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్ అండ్ బీ బంగ్లా వరకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని కాలువల్లో మురుగును తీయించారు. అనంతరం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సహదేవరెడ్డి, మున్సిపల్ అధికారులు, మెప్మా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



ఒంటిమిట్టలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

ఒంటిమిట్ట : పరిసరాలను ప్రతిఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. ఒంటిమిట్టలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, డీపీవో రాజ్యలక్ష్మితో కలసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. డీఎల్పీవో విజయభాస్కర్, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీవో సుజాతమ్మ, జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కాలువలోని పూడిక తొలగింపును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ భావన

రైల్వేకోడూరు : రైల్వేకోడూరులో రాజంపేట డివిజనల్ అభివృద్ధి అధికారి, రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి నరసింహమూర్తి ఆధ్వర్యంలో డ్రైనేజీని పరిశుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సంకల్పాన్ని ప్రజలు విజయవంతం చేయాలన్నారు. ఎంపీడీవో నాగార్జునరావు, సర్పంచ్ బుడిడి శివయ్య, ఈవో వరప్రసాద్‌రావు, రైల్వేకోడూరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రాజు, ఉపాధి ఏపీవో మృత్యుంజయ రావు, కూటమి నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.


రైల్వేకోడూరు: డ్రైనేజీలోని పూడికను తొలగిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్: రాయచోటి పట్టణంలోని మాసాపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ ఉద్యోగులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్ర మాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. మునియా నాయక్ తదితరులు పాల్గొన్నారు

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి

రాజంపేట టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : చౌకదుకాణ డీలర్లు అందరూ లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరకులను పంపిణీ చేయాలని రాజంపేట సబ్‌కలెక్టర్ హెచ్‌ఎస్ భావన తెలిపారు. శనివారం పట్టణంలోని ఏడో చౌక దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సాయంత్రం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. ప్రతినెల 26వ తేదీ నుంచి నెలాఖరు వరకు 65 ఏళ్లు నిండిన వారికి వారి ఇళ్ల వద్దే సరుకులను అందజేయాలన్నారు. కార్డుదారులను చౌక దుకాణాల చుట్టూ తిప్పుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట తహసీల్దారు పీర్‌మున్నీ, చౌకదుకాణ డీలరు జి.సుగుణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 23 (ఆం ధ్రజ్యోతి): హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీసీఎస్‌ఎస్ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి తెలిపారు. శని వారం స్థానిక డాక్టర్ బీఆర్ అం బేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందిం చేందుకు ఎన్‌ఏసీవో నేతృత్వంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవీ పరీక్షలు చేసుకునేందుకు బాధితులు ముందుకు రావాలని, సమాజం కూడా వారిని చిన్నచూపు చూడకుండా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం హెచ్‌ఐవీ పోస్టర్ ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ప్రవీణ, ఉపాధ్యాయులు ఉషారాణి, జయసుధ, చంద్రమ్మ, పీఈటీ అంజలి, పీసీఎస్ ప్రవీణ, ఓఆర్‌డబ్ల్యూ విజయలక్ష్మి, పీఈ సంపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత అవకాశాలు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు నని లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ అన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీలో భాగంగా శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో హాస్టల్ వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధిస్తే మంచి కాలేజీల్లో సీటు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫారెస్టు సిబ్బందిపై దాడికి నిరసన

రామాపురం, ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి): అటవీశాఖ సిబ్బందిపై దాడి కి నిరసనగా రాయచోటి ఫారెస్టు రేంజ్ కార్యాలయం వద్ద శనివారం ఫారెస్టు సిబ్బంది ధర్నా నిర్వహించా రు. ఈ సందర్భంగా డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ రమేశ్ మాట్లాడుతూ శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అతని అనుచరులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రమేశ్ బీట్ అధికారులు వర్ధికుమార్, రఘుపతిరాజు, రెడ్డెప్ప, నాగరత్నమ్మ, విజయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు మంజూరు : ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో బకాయి పడిన ఉపాధి హామీ బిల్లులను మంజూరు చేసినట్లు ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీడీ ప్రతాప్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో 1280 పనులకు రూ.1.77 కోట్లు బకాయిలుండగా రూ.1.42 కోట్ల ను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. చిట్వేలి మండలానికి గాను 423 పనులకు రూ.25.63 లక్షలు, రైల్వేకోడూరు మండలంలో 191 పను లకు రూ.33.21 లక్షలు, ఓబులవారిపల్లె మండలంలో 233 పనులకు 24.84 లక్షలు, పెనగలూరులో 177 పనులకు గాను రూ.31.68 లక్షలు, పుల్లంపేట 256 పనులకు రూ.27.18 లక్షలు మంజూరయ్యాయన్నారు. స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకుండా ఫీల్డ్ అసిస్టెంట్ల పేర్లపై బిల్లులు మంజూరు చేయడంపై అనంతరం చిట్వేలి మండలం ఏపీవోపై రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అన్నారెడ్డి మల్‌రెడ్డి, ఏపీడీ ప్రతాప్, పంచాయతీరాజ్ డీఈ బాలనరసింహులు, స్థానిక టీడీపీ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, పయ్యావుల కోటేశ్వరరావు, పోలిన శివయ్యనాయుడు, ఐదు మండలాలకు సంబంధించిన ఉపాధిహామీ ఏపీవోలు, సిబ్బంది, పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

బెల్టు షాపులపై దాడులు ఇద్దరి అరెస్టు

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్టు షాపులపై శుక్రవారం అర్ధ రాత్రి విజయవాడ, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, కోడూరు ప్రొహిషన్ శాఖ అధికారులుతో కలిసి దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ టి.కె.తులసి తెలి పారు. మైసూరివారిపల్లి పంచాయతీ క్రాస్ సమీపంలోని ఓ దుకాణంలో 21 మద్యం సీసాలు, శెట్టిగుంట పంచాయతీ ప్రధాన రహదారిలోని ఓ దుకాణంలో 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని రమాదేవి, గౌరి శంకర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. శనివారం ఇరువురిని కోర్టుకు తరలించినట్లు వివరించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాలపై ఎఫ్‌ఆర్‌ఓ జె. మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని ఆదేశించారు. జిల్లాలో అవసరమైనంత యూరియా స్టాక్ ఉందని తెలిపారు. ప్రతి ఎరువుల దుకాణంలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, మండల హార్టీకల్చర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఒంగోలుకు తరలిన సీపీఐ నేతలు

రాజంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈ నెల 24 నుంచి జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలకు ఆ పార్టీ నేతలు శనివారం తరలివెళ్లారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్, నియోజకవర్గ సీపీఐ నాయకులు శివరామ కృష్ణదేవర, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణచైతన్య, గాలి చంద్ర, సికిందర్ ఆధ్వర్యంలో ఒంగోలుకు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు.

ఆంధ్ర కేసరికి ఘన నివాళి

రైల్వేకోడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవ కు తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని, ఆయన అడుగుజాడలు ఆదర్శమని వక్తలు అన్నా రు. అనంతరాజు పేట ఉద్యాన కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు బీఎస్ శర్మ ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో నివాళులర్పించారు


నివాళులర్పిస్తున్న ప్రజలు

సిద్ధవటం: మండలంలోని 11వ పోలీసు బెటాలియన్‌లో కమాండెంట్ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి టంగుటూరు ప్రకాశం పంతులు సేవలను సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

సిద్దవటం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యవసాయ కార్యాలయంలో శనివారం 98 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు ఏఈవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా 200 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని, ఇకపై కూడా ప్రతిఒక్కరికి యూరియా పంపిణీ చేస్తామన్నారు. ఎలాంటి అవాంఛణీయ సంఘటనలు తలెతకుండా ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

చమర్తి జగన్‌మోహన్ రాజుకు సన్మానం

రాజంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట అసెంబ్లీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజును మైనార్టీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ గుల్జార్‌బాషా, అల్ బ్రదర్ మసీదు ముత్తవల్లిలు శనివారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించి కేక్ కట్‌చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చమర్తి ఆధ్వర్యంలో టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మైనార్టీల సమస్యలు పరిష్కరించాలని చమర్తి జగన్‌మోహన్ రాజును కోరారు.ఈ సందర్భంగా చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ మైనార్టీల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అందరం కలిసి రాజంపేటను అభివృద్ధి చేసుకుందామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇనయతుల్లా, నజీర్‌బాషా, అన్వర్‌బాషా, కమాల్‌బాషా, మసీదు గురువు మౌలా, మహమ్మద్ షరీఫ్, ఫాజ్, చాంద్‌బాషా, జానీబాషా, మౌలానా పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'వడ్డెర్లకు టీడీపీ పార్లమెంట్' అధ్యక్ష పదవి ఇవ్వాలి'

రాయచోటిటౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పదవిని చమర్తి జగన్‌మోహన్‌రాజుకు ఇవ్వడంతో జిల్లా అధ్యక్ష పదవిని అన్నమయ్య జిల్లాలో అత్యధిక ఓటర్లు కలిగిన వడ్డెర్లకు ఇవ్వాలని రాష్ట్ర ప్రజాగళం అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పార్లమెంట్ స్థానంలో 2 లక్షల పైచిలుకు జనాభాతో 1.90 లక్షల ఓట్లు కలిగిన వడ్డెర్లకు నామినేటెడ్ పదవుల్లో గానీ, పార్టీ పదవుల్లో గానీ సముచిత స్థానం కల్పించడం లేదన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వడ్డెర్లకు ప్రాధాన్యం కల్పించాలన్నారు.

'అభివృద్ధికి అడ్డులేదు.. సంక్షేమానికి తిరుగులేదు'

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి అడ్డులేదని, సంక్షేమానికి తిరుగులేదని, సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్‌గా నిల్చాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేసిన పథకాల వివరాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడం అది ఒక మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యం అన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

రాజంపేట, ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మూడ వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శని వారం రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు లో ఆయన మాట్లాడుతూ అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, తప్పుడు కేసులు పెట్టినవారి పై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. డీఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకో వాలన్నారు. సాంఘిక సంక్షేమాధికారి హైమావతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత నాయుడు, పట్టణ ఎస్‌ఐ వెంకటేశ్, కళాశాల ప్రిన్సిపాల్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో జాతీయ అంతరిక్ష దినోత్సవం

రాజంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలో నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని అన్నమాచార్య యూనివర్సిటీ వీసీ సాయిబాబా రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ అంతరిక్ష దినం సందర్భంగా శనివారం యూనివర్సిటీలోని ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష రంగంలో ఎన్నో ఘనవిజయాలు సాధించి ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ మాట్లాడుతూ అంతరిక్ష విజ్ఞానం యువతకు స్ఫూర్తిదాయకమైన రంగం అని, శాస్త్రవేత్తల త్యాగం కృషివల్లే మనదేశం ప్రపంచంలోనే పెద్ద అంతరిక్ష శక్తిగా అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జె.చిన్నబాబు, సీహెచ్ నాగరాజు, వెంకటేశ్, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

నందలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని అనధికారిక లేఅవుట్‌లు, ప్లాట్లు, స్థలాలను క్రమబద్ధీకరణ చేసుకోవాలని కడప పట్టణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సీటీ కృష్ణసింగ్ సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అనధికార లేఅవుట్‌ల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 30 లోపు అనధికార, వెంచర్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. 90 రోజుల్లోపు లైసెన్సు కలిగిన ప్లానర్స్ లేదా వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదుకు గడువు ఉందన్నారు. నిర్ణీత గడువులోగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోని పక్షంలో లేఅవుట్‌లోని హద్దు రాళ్లను తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం అనధికారిక లేఅవుట్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ ఇందు, ప్లానింగ్ సెక్రటరీ మునెయ్య, పంచాయతీ సెక్రటరీలు శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'టీ తాగుదాం చర్చించుకుందాం'

రాయచోటిటౌన్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో భాగంగా శనివారం పట్టు పరిశ్రమశాఖ ఆవరణలో ఏపీజీఈఏ రాయచోటి తాలూకా అధ్యక్షుడు ఓ. సాయికుమార్ ఆధ్వర్యంలో రండి టీ తాగుతూ మాట్లాడుతుకుందాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ, డీఏలను ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంపైబడినా ఇంకా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తున్నదన్నారు. ఇప్పటికే ఉద్యోగులకు సుమారు 25 కోట్ల రూపాయలు ప్రభుత్వం బకాయి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డినాయక్, పట్టు పరిశ్రమశాఖ సూపరింటెండెంట్ చాన్‌బాషా, ఏఎస్‌వో నాగసుబ్బరాయుడు, పెన్షనర్ సంఘం అధ్యక్షులు రాజా తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

పుల్లంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పి.కమ్మపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆర్. రామకృష్ణయ్య శనివారం కంప్యూటర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్ఎం శిభగతుల్లా, టీడీపీ నాయకుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ రామకృష్ణయ్య ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా అందరి మన్ననలను పొందారని ఆయన పంచాయతీలో విద్యాభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు సర్ఫ్రాజ్‌హుస్సేన్, బాల నరసింహులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామి ఆలయంలో పూజలు

రైల్వేకోడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆరాధనోత్సవాల సందర్భంగా స్థానిక వెంకయ్య స్వామి ఆలయంలో శనివారం పంచామృతాభిషేకం, హోమాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, భక్తులకు అన్నదానం చేశారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామి శంకరానంద ఆధ్వర్యం లో ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు.

పెనగలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె సమీపాన గల గొలగమూడి వెంకయ్య స్వామి సిద్ధాశ్రమంలో ధర్మకర్త యడమల్ల బుజ్జిరెడ్డిస్వామి అధ్యక్షతన ఆరాధన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

దర్గా స్వామీజీ, దర్గా మాతాజీ ఆరాధనోత్సవాలు

రామాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ శ్రీసాయినగర్‌లో శనివారం శ్రీసద్గురు స్వామిజీ, సద్గురు మాతాజీ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజయ్యారు. అనంతరం అన్నదానం చేశారు.

కుట్టు పనితో మహిళలకు జీవనోపాధి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): మహిళలు కుట్టు మిషన్లతో జీవనోపాధి పొందవచ్చునని మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఎనమల మదన్‌మోహన్ తెలిపారు. శనివారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల జీవనోపాధి కోసం ఉచితంగా కుట్టుమిషన్లు అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు కాంతమ్మ, సర్పంచ్ లక్ష్మీ నారాయణ, కావలి ఆంజనేయులు, మండల అధ్యక్షుడు విశ్వనాథ , ధన, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటల యాజమాన్యంపై అవగాహన

సుండుపల్లె/ గాలివీడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన శాస్త్రవేత్తలు ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ మానస తెలిపారు. శనివారం రెండు మండలాల్లోని పలు గ్రామాల్లో మాచిరెడ్డిగారిపల్లె, ముడుంపాడు గ్రామ పంచాయతీల్లో మామిడి కోత అనంతరం పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మామిడి రైతు డ్రిప్ పద్ధతిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. .

వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

రామాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలనిలక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, రామాపురం ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి సూచించారు. శనివారం రామాపురం పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నియమ నిబంధనలను తెలియజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. .

అదుపు తప్పి ఆటో బోల్తా

గాలివీడు, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): బలిజపల్లె వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు... శనివారం ఉదయం పది గంటల ప్రాంతంలో గాలివీడు నుంచి నడింపల్లి వైపు వెళుతున్న ఆటో జగనన్న కాలనీ వద్దకు రాగానే అదుపు తప్పి బ్రిడ్జ్ మీద నుంచి కిందకు పడిపోయింది. అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా దూకేశాడు. ఆటోలో ఉన్న పాల క్యాన్లు, ఎరువు బ్యాగులు కాలువలో పడిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.



ప్రసన్నాంజనేయాలయంలో అన్నదానం

రాయచోటి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి): శ్రావణ శనివారం సందర్భంగా స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, సుగవాసి ప్రసాద్‌బాబు పూజ లు చేశారు. ఈ సందర్భంగా డిష్ హెడ్ మెకానిక్ గురవయ్య ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అర్చకులు ప్రసాద్‌బాబు ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.


భక్తులకు భోజనం వడ్డిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

లక్కిరెడ్డిపల్లె: మండలంలోని బీ. యర్రగుడి గ్రామంలో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు సమర్పించి భజనలు నిర్వహించారు. మధ్యాహ్నం తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు తోపురెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

రామాపురం: సుద్దమళ్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెలోని అభయహస్త ఆంజనేయ స్వామి ఆలయంలో సుద్దమళ్ల శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

నందలూరు: అరవపల్లెలో ప్రసన్నవరదాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, ఆకు పూజ నిర్వహించారు. అనంతరం భక్తులు పద్దఎత్తున అన్నదానం చేశారు.

గాలివీడు : గండిమడుగులో శ్రావణమాస ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. జిల్లాకు సరిహద్దులో ఉండడంతో సత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి అత్యధికంగా భక్తులు గండిమడుగుకు వచ్చారు. నూలివీడు పంచాయతీలో నాగూరువాండ్లపల్లెలో అంజన్నకు పూజలు నిర్వహించి అన్నదానం చేశారు

కొత్తగా..పరీక్షలు

● ప్రశ్నపత్రాల స్థానంలో బుక్‌లెట్లు
● నూతన విధానానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం
● ఒత్తిడి తగ్గించాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిర్ణయాల వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. విద్యార్థులకు కనీసం ప్రశ్నపత్రాలు అందించలేని దుస్థితి నెలకొంది. ఉపాధ్యాయులు బోర్డులపై ప్రశ్నలు రాస్తే వాటిని విద్యార్థులు ఎక్కించుకుని పరీక్షలు రాసేవారు. కనీసం సుద్దముక్కకు కూడా డబ్బులు ఇవ్వని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి భిన్నంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుడుతోంది. ప్రశ్నపత్రాల స్థానంలో బుక్‌లెట్లు ప్రవేశపెట్టింది. అయితే ఈ విధానంతో తమకు పనిభారం పెరిగి బోధన సమయం తగ్గిపోతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ప్రశ్న సమాధాన పత్రాలకు స్వస్తి పలికి బుక్‌లెట్ విధానాన్ని తీసుకొచ్చింది. ప్రతి సబ్జెక్టుకు స్టూడెంట్ అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను ప్రవేశపెట్టింది. 1 నుంచి 10వ తరగతి వరకు నూతన పరీక్ష విధానాన్ని అమలు చేస్తున్నారు. పరీక్షలన్నీ బుక్‌లెట్‌లోనే రాయాలి. ప్రశ్నలు, జవాబులకు సరిపడా బుక్‌లెట్‌లో పేజీలు కేటాయించింది. సోషల్‌కు మ్యాపులు, గణితానికి గ్రాఫ్‌లు, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు సంబంధించిన ఓఎంఆర్ షీటు అన్నీ అందులోనే ఉంటాయి. విద్యార్థుల అపార్ ఐడి నెంబర్, పూర్తి వివరాలు, ప్రశ్నపత్రం కోడ్, పరీక్ష సమయం అందులో ఉంటాయి. ఎఫ్ఏలు నాలుగు, ఎస్ఏలు రెండు పరీక్షల తేదీలతో పాటు బుక్‌లెట్‌లో ఉంటాయి. ఈ బుక్‌లెట్ ఆధారంగా విద్యార్థుల ప్రగతి సామర్థ్యాన్ని ఉన్నతాధికారులు అంచనా వేస్తారు. దీనిని బట్టి విద్యార్థులకు ఏ బీ సీ డీ కేటగిరీలు కేటాయిస్తారు. నూతనంగా ప్రవేశపెట్టిన పరీక్ష విధానాన్ని ఉపాధ్యాయులు స్వాగతిస్తూనే పని ఒత్తిడి తగ్గించాలని కోరుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రవేశపెట్టిన పరీక్ష విధానం బాగుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

బుక్‌లెట్‌తో మంచి ఫలితాలు రావు



పరీక్షల నిర్వహణలో మూల్యాంకన పుస్తకం అనే విధానం కొత్త సమస్యలకు దారితీస్తుంది. దీని వలన పాఠశాల పనివేళలో బోధన సమయాన్ని హరించే విధంగా ఉంది. దీనితో పాఠశాలలో మూల్యాంకనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడి బోధనా సమయానికి అంతరాయం ఏర్పడుతుంది. మార్కుల నమోదు, ఆన్‌లైన్ నమోదు, రికార్డుల నమోదులతో పాటు బబ్లింగ్ చేసే పనికూడా ఉపాధ్యాయులకు ఇవ్వడం వలన ఉపాధ్యాయునికి ఈ విధానం కష్టమవుతుంది.

- టి.ఖాదర్‌బాషా, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

పరీక్షలు విద్యార్థులకా? ఉపాధ్యాయులకా?



ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు విద్యార్థులకు లేక ఉపాధ్యాయులకో అర్థం కావడం లేదు. ప్రతి విద్యార్థికి సంబంధించిన అంశాలను ఉపాధ్యాయుడే రాయాలని చెప్పడం వలన పరీక్షలు ముగిసిన తర్వాత రోజుల తరబడి మూల్యాంకనం చేసుకోవడానికి సమయం సరిపోతుంది. దీని వలన బోధన అటకెక్కే పరిస్థితి ఏర్పడింది. పరీక్ష పత్రాలన్నీ స్కాన్ చేసి అప్‌లోడ్ చేయమనడం వల్ల ఇప్పటికే అనేక బోధనేతర కార్యక్రమాలతో సతమతమవుతున్న ఉపాధ్యాయులకు ఇది మరింత భారంగా మారింది.

- పాలెం మహేశ్‌బాబు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

గురువుపై దిద్దుబాటు బరువు



ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెస్తున్నా కొన్ని అంశాలు ఉపాధ్యాయులకు మరికొన్ని అంశాలు విద్యార్థులకు ఇబ్బంది కలిగించేలా ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరీక్ష విధానంలో విద్యార్థుల స్థాయికి మించిన ప్రశ్నలు ఇచ్చారు. విద్యార్థుల జవాబు పత్రం మూల్యాంకనం చేసి వాటి మార్కులను ఓఎంఆర్ షీట్‌లో బబ్లింగ్ చేసే విధంగా ఉపాధ్యాయులకు పనిపెట్టడం చాలా ఇబ్బందిగా ఉంది. ఈ విధానం మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలి.

- ఎస్.రామాంజనేయులు, ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

పని విభజన సర్దుబాటు చేయాలి



విద్యాశాఖలో జరుగుతున్న సంస్కరణలతో పాటు పని విభజనను కూడా సర్దుబాటు జరగాలి. అసెస్‌మెంట్ బుక్ ద్వారా పరీక్షలు, మూల్యాంకనంతో పనిభారం ఎక్కువైంది. తదనుగుణంగా పరీక్షలు, మూల్యాంకనం, బోధన, సిలబస్‌పై కూలంకుషంగా చర్చించి పని రోజుల సంఖ్యను విభజించాలి. ఉపాధ్యాయులు ఆన్‌లైన్ చేస్తున్నప్పుడు ఆఫ్‌లైన్ రద్దుచేయాలి. అసెస్‌మెంట్ పుస్తకాలతో పరీక్షల విధానాన్ని పునఃసమీక్షించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న పవిత్ర

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గుర్రంకొండ మండలంలో చోటు చేసుకుంది. శనివారం ఉదయం కడుపునొప్పి ఎక్కువగా రావడంతో తట్టుకోలేక పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు గుర్రంకొండ మండలం, చెర్లోపల్లెకు చెందిన శివ భార్య పవిత్ర (26) పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

ఐదుగురిపై కేసు నమోదు

నిమ్మనపల్లె, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాల వద్ద దారి వివాదమై జరిగిన ఘర్షణలో ముగ్గురు గాయపడడంతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అగ్రహారం పంచాయతీ రెడ్డివారిపల్లె వాసి గుల్ల శ్రీనివాసులురెడ్డి తన పొలం వద్ద దారి సమస్య కారణంగా జరిగిన ఘర్షణలో అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డిని ఆయన భార్య యమున, చెల్లెలు సుజాతపై భాస్కర్‌రెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, క్రిష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారు. దీంతో శ్రీనివాసులురెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

చుక్కలు చూపిన ఏడుకొండలు ఎక్స్‌ప్రెస్

ఐదు గంటలు ఆలస్యంతో ప్రయాణికుల అసహనం



ములకలచెరువు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే ఏడు కొండలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం ప్రయాణికులకు చుక్కలు చూపించింది. ఐదు గంటల పాటు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు గుర్రై తీవ్ర అవస్థలు పడ్డారు. సాంకేతిక కారణాలతో సికింద్రాబాద్ జంక్షన్‌లో రైలు నాలుగున్నర గంటలకుపైగా ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సిన రైలు ఉదయం 7.49 గంటలకు వచ్చింది. అలాగే మదనపల్లె రోడ్‌కు తెల్లవారుజామున 3.18 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 8.16 గంటలకు, కదిరికి తెల్లవారుజామున 3.49 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 8.41 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు వెళ్లాల్సి ఉండగా 8.52 గంటకు వెళ్లింది. అలాగే ఉదయం 6.25 గంటలకు తిరుపతికి చేరాల్సిన రైలు ఉదయం 10.14 గంటలకు వెళ్లింది. రైలు తీవ్ర ఆలస్యంగా నడవడంతో రైల్వేస్టేషన్లలో రైలు కోసం గంటల తరబడిగా వేచి చూసి అసహనానికి గురయ్యారు.

ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు



కలెక్టర్ నుంచి స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులు

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులకు శనివారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ స్కాలర్‌షిప్‌లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో క్రెడిట్ యాక్సెస్ ఇండియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మదనపల్లెకు చెందిన ఏ. పూజిత, ములకలచెరువుకు చెందిన పి. తేజస్విని, చౌడేపల్లెకి చెందిన బి. రెడ్డిరాణి, కదిరికి చెందిన ఎస్. సాదక్, బి. కొత్తకోటకు చెందిన పి. వల్లి ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ తరఫున డివిజనల్ మేనేజర్ జగదీశ్, ఏరియా మేనేజర్ హనుమంతయ్య, సుంకన్న, బ్రాంచ్ మేనేజర్ మధుసూదన్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఏపీ లిక్విడ్ స్ప్రేతో మంచి దిగుబడులు

జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ



రైతులకు వేప మొక్కలను అందజేస్తున్న జేడీఏ శివనారాయణ

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పైరుకు డీఏపీ చల్లకుండా లిక్విడ్‌తో స్ప్రే చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివనారాయణ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనివారం బీ.యర్రగుడి పంచాయతీలోని చెంచర్లపల్లి, యర్రగుడి, మామిడిగారిపల్లెల్లోని వేరుశనగ, కంది, ఆముదం పంటలకు డీఏపీ లిక్విడ్ స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విస్కో కంపెనీ వారు డీఏపీని స్ప్రేగా విక్రయిస్తున్నారని, దీనిని ప్రతి రైతు ఉపయోగించుకోవచ్చునన్నారు. వేరుశనగ, ఆముదం, కంది, వరి, ఇతర పైర్లకు డీఏపీ లిక్విడ్ స్ప్రే చేసుకోవచ్చునన్నారు. రైతు పొలం గట్టున మొక్కలు నాటుకుంటే ఎంతో ఉపయోగకరమని 200 వేప మొక్కలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జయరాణి, ఏవో రాజాకుమారి, ఏఈవో అనూష, ఆర్ఎస్ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వరికోత యంత్రం బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

బి.కొత్తకోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తుమ్మణంగుట్ట సమీప జాతీయ రహదారిపై వెళుతున్న వరికోత యంత్రం బోల్తాపడింది. శనివారం సాయంత్రం వెళుతున్న యంత్రం పైనుంచి 15 అడుగుల కిందికి రోడ్డుపైకి పడిపోవడంతో డ్రైవర్ గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108కు సమాచారం అందించి మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం జగన్ కాలనీకి చెందిన మంగమ్మ మిద్దెపై దుస్తులు ఆరవేస్తూ శనివారం కిందపడింది. దీంతో తలకు గాయమై స్పృహ కోల్పోయింది. వెంటనే కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్సను అందించిన డాక్టరు ఆమె పరిస్థితి విషమంగా ఉందని ఎక్కడికైని తీసుకెళ్లాలని చెప్పారు. అయితే వారి ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో ఇక్కడ ఐసీయూలోనే ఉంచారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి : కలెక్టర్



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలో కలెక్టర్ శ్రీధర్

కలకడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులకు సూచించారు. శనివారం కలకడలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమం ప్రతి నెలా మూడవ శనివారం జిల్లా వ్యాప్తంగా జరుగుతుందన్నారు. గత మాసాంతం నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున జనావాసాల పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, జ్వరాలు ప్రబలడంతో పాటు అంటువ్యాధులు సోకే ప్రమాదముందన్నారు. వీటి నివారణ చర్యల్లో భాగంగా ప్రతి పంచాయతీ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీలు, పంచాయతీ సచివాలయాలు, పారిశుధ్య సిబ్బంది సమిష్టిగా ప్రతి శుక్రవారం ప్రజలు డ్రైడే పాటించేలా కృషి చేయాలన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని తెలిపారు. అనంతరం బస్టాండు వద్ద ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. కాగా జాతీయ రహదారి పక్కనే మురికినీటి నిల్వను గమనించిన కలెక్టర్ స్వయంగా స్ప్రే చేసి పంచాయితీరాజ్ శాఖాధికారులు, కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి దయాకర్‌రెడ్డి, తహశీల్దార్ మహేశ్వరిబాయి, ఎంపీడీవో జగదీశ్వర్, ప్రతా ఎరెడ్డి, ఏపీవో సుజాత, సర్పంచ్ విశ్వనాథ్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్నానికే సబ్ కలెక్టరేట్ ఖాళీ

● మధ్యాహ్నం 3 గంటలకు సీట్లన్నీ ఖాళీ
● పనుల కోసం వచ్చిన ప్రజల బేజారు



మధ్యాహ్నం 3 గంటకు ఖాళీగా కనిపిస్తున్న సబ్‌కలెక్టరేట్

మదనపల్లె టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సబ్‌కలెక్టర్ కార్యాలయం 11 మండలాలు, 10 లక్షల మంది ప్రజలకు రెవెన్యూ సేవలందిస్తుంటుంది. అటువంటి ఈ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు విధి నిర్వహణలో సమయపాలన పాటించడం లేదు. వివిధ రెవెన్యూ సేవల కోసం వచ్చే ప్రజలకు ఇక్కడి ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైల్స్ దహనం జరిగినప్పటి నుంచి ఇక్కడి ఉద్యోగులు పనివేళల్లో, వాచ్‌మెన్లు, సెక్యూరిటీ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. కానీ శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సబ్‌కలెక్టరేట్‌లో ఉద్యోగుల సీట్లన్నీ ఖాళీగా కనిపించాయి. కార్యాలయంలోకి ఎవరు వెళ్లినా అడిగే సమాధానం ఇచ్చేవారు లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మినిస్టీరియల్ ఉద్యోగులు ఉదయం 10 గంటకు విధులకు హాజరు కావాల్సి ఉంది. వీరు వచ్చిన వెంటనే బయోమెట్రిక్ హాజరు వేసుకుని, సాయంత్రం 5.30 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంది. మధ్యలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల లోపు ఎప్పుడైనా అరగంట పాటు భోజన విరామం ఉంటుంది. ఇది ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మినిస్టీరియల్ సిబ్బంది విధిగా అమలు చేయాల్సిన నిబంధన. కానీ మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో మాత్రం కొందరు ఉద్యోగులు వారికి ఇష్టమొచ్చినప్పుడు రావడం, టీలకు, భోజనాలకు అంటూ సమయపాలన మరిచి బయటకు వెళుతున్నారు. కనీసం వీరి సీటును వదిలి వెళ్లేటప్పుడు విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు కూడా ఆఫ్ చేయకుండా వెళ్లిపోతున్నారు. ఇది వారి నిర్లక్ష్యానికి తార్కాణమనే చెప్పవచ్చు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న సబ్‌కలెక్టర్ కల్యాణి సబ్‌కలెక్టరేట్ ఉద్యోగులను ఒక గాడిన పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై సబ్‌కలెక్టర్ కల్యాణి వివరణ కోరగా ఇక్కడి ఉద్యోగులు మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు భోజనానికి వెళ్లి ఉండవచ్చని, కొందరు తనతో పాటు రాయచోటిలో ఆర్బిట్రేషన్ కేసుల విషయమై వచ్చారని చెప్పారు.

వచ్చే ఏడాది మెడికల్ కాలేజి ప్రారంభించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్లు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల నిర్మాణం ఆగింది కాసుల కోసమేనని, 2026 సంవత్సరానికి కాలేజి ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మదనపల్లెలో కొత్తగా నిర్మాణం చేపట్టిన మెడికల్ కళాశాల భవనాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2022లో వైసీపీ ప్రభుత్వంలో కొత్త మెడికల్ కళాశాలలు మదనపల్లె, ఆదోని, మార్కాపురం, పులివెందులలో అగ్రిమెంట్ చేసుకుందన్నారు. ఇందులో భాగంగా మదనపల్లె రూ.472 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. పనులు ఆలస్యం కావడంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.12 కోట్లతో తాత్కాలిక భవనాలకు నిధులు మంజూరు చేశారు. ఇందులో రూ.7 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపినా అందులో కనీసం కోటి రూపాయల విలువైన పనులు కూడా జరగలేదని ఆరోపించారు. గతంలో పనులు మెగా కంపెనీకి కేటాయించగా రెండు కళాశాలల భవనాలు ప్రారంభించారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో నిర్మాణాలు ఆపేశారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది బదిలీ చేసి మదనపల్లె ప్రజల ఆశలపై నీళ్లు చల్లారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు హరిశర్మ, శ్రీరాములు, రామమూర్తి, రాజు, కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై దాడులు



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో ఎరువుల దుకాణాలపై వ్యవసాయ, ఉద్యానశాఖ సంయుక్తంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాజేంద్రప్రసాద్, గీతావాణి తనిఖీలు నిర్వహించారు. యూరియా నిల్వ ఉంచిన గోడౌన్‌ను పరిశీలించారు. యూరియా కొరత లేకుండా చూసుకోవాలని, అందుకు సంబంధించిన యూరియా నిల్వలను ఉంచాలని ఎరువుల దుకాణం యజమానులకు సూచించారు. ఎరువుల అమ్మకాల వాటి సంబంధించిన రసీదులను పరిశీలించారు. అక్రమంగా యూరియా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సురేశ్, పీస్ సుధాకర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ భావన

రాజంపేట టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం రైల్వేకోడూరు రోడ్డులోని ఎరువుల దుకాణాన్ని శనివారం సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు వివరాలను పరిశీలించారు. నిర్ణయించిన ధర మేరకే ఎరువులను అందజేయాలని అలా కాకుండా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీరుమున్నీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో...

నందలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో శనివారం డిప్యూటీ తహసీల్దార్ మోహన్‌కృష్ణ, మండల వ్యవసాయాధికారి మల్లికార్జున తనిఖీలు చేశారు. యూరియాను నిర్దేశిత ధరకే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెరగాలి

రాయచోటిటౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష పరిశోధనలో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా ఎదగడం భారతీయులందరికీ గర్వకారణమని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శనివారం డైట్ ప్రాంగణంలో డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 ఆగస్టు 23న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ శివశక్తి అనే ప్రదేశంలో సురక్షితంగా దిగిందన్నారు.

ఈ విజయాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఆగస్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సంగా నిర్ణయించిందన్నారు. అంతరిక్ష ప్రయోగాలపై పిల్లలు, యువతలో ఆసక్తి పెంపొందించడానికి విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇస్రో యువిక (యంగ్ సైంటిస్ట్)- 2025 అనే కార్యక్రమం నిర్వహిస్తోందని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వ పోస్టర్ల తయారీ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు శివభాస్కర్, వైసీ రెడ్డెప్పరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గిరిబాబు యాదవ్, శివప్రసాద్, తిరుపతి శ్రీనివాస్, కేదార్నాథ్, మోహన్‌నాయక్, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

» ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

కడప, అగస్టు 23 : పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్సనందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన, ఎస్.పి. బంగళా ఎదురుగా హరితా హోటల్ ఎ.పి. టూరిజం నందు, ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. ఆది, సోమవారం రెండురోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబరులో సంప్రదించాలన్నారు.

కూటమి ప్రభుత్వంలోనూ..

● మితిమీరుతున్న ఆక్రమణలు
● చోద్యం చూస్తున్న అధికారులు

వైసీపీ నేతల భూకబ్జా



కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ నేతలు భూ ఆక్రమణలకు తెగబడుతున్నారు. అడ్డు చెప్పేవారు లేకపోవడంతో వైసీపీ ఆక్రమణల పర్వం ఇంకా కొనసాగుతుంది. దీనికి అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల ద్వారా కొద్దో గొప్పో లబ్ధి పొందడం వల్ల స్వామిభక్తి చాటుకుంటున్నట్లు సమాచారం. అందుకే ఆక్రమణల గురించి తెలిసినా పట్టించుకోవడం లేదని చర్చ సాగుతుంది. ఎవరైనా ప్రజలు ఫిర్యాదు చేస్తే తప్ప రెవెన్యూ అధికారుల్లో చలనం కనిపించడం లేదనేది స్పష్టమవుతుంది. ఇటీవల కమలాపురం మండలంలో కూడా ప్రజలు ఫిర్యాదు చేసిన తరువాతనే అది ప్రభుత్వ భూమి అని, అక్కడ ఎవరూ ఆక్రమించుకోరాదు అంటూ ఒక బోర్డును పాతిపెట్టారు. అంతవరకు ఆ భూములు వైసీపీ నాయకులు తమ సొంత భూములుగా భావించి వనాలు తయారు చేసుకున్న పరిస్థితి. జిల్లాలో దాదాపు ప్రతి మండలంలో గత ప్రభుత్వ హయాంలో భూ ఆక్రమణలు జరిగాయన్నది బహిరంగ రహస్యమే. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఇవి అలాగే ఉన్నాయి. ప్రజలు ధైర్యం చేసి ఫిర్యాదు చేస్తే తప్ప ఆక్రమణదారుల కబంధ హస్తాల నుంచి భూములు బయటపడే పరిస్థితి లేదు.

ప్రభుత్వం మారినా..

ప్రభుత్వం మారినా వైసీపీ నాయకులు భూఆక్రమణలు కొనసాగిస్తూనే ఉన్నారు. కడప నగరంలో భూముల ధరలు భారీగా పెరిగిపోయాయి. దీంతో ఎక్కడ ఏ కొంత ఖాళీ జాగా కనిపించినా పాగా వేస్తున్నారు. కొంత మంది నకిలీ పత్రాలు తయారు చేసుకుని స్వాహా పర్వానికి తెరలేపుతున్నారు. తాజాగా కడప నగరంలోని మూడో డివిజన్‌లో వైసీపీ నాయకుడు ఒకరు ప్రభుత్వ భూమిలో భవనాల నిర్మాణం సాగిస్తున్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా ఏర్పడిన ఆర్‌కే నగర్ సమీపంలో ఇతర కాలనీలు వెలిశాయి. ఇక్కడ గతంలో కొంతమంది నిరుపేదలకు స్థలాలు కేటాయించారు. అందులో కొంతమంది గృహాలు నిర్మించుకోగా మరికొంత స్థలం ఖాళీగా ఉండేది. ఈ కళాశాల స్థలాల్లో వైసీపీ నాయకులు ప్రస్తుతం భవనాలను నిర్మాణం చేపడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో స్థలం పొందిన వారు వచ్చి అడ్డు చెబితే మీకు ఇచ్చిన స్థలాలు రద్దయిపోయాయి అంటూ బుకాయించడంతో పాటు దౌర్జన్యాలకు దిగి స్థలాలు ఆక్రమించుకుని భవనాలు నిర్మిస్తున్నట్లు సమాచారం.

కడప రింగు రోడ్డుకు ఆనుకుని ఉన్న బైపాస్ రోడ్డు పక్కన ఉన్న ప్రాంతంలో పేదల కాలనీలో గల ప్రభుత్వ స్థలం కొంత స్థలం ఆక్రమించి యథేచ్ఛగా బిల్డింగులు నిర్మిస్తున్నారు. దీనికి కొందరు రెవెన్యూ సిబ్బంది సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జగన్ ప్రభుత్వంలో భూ ఆక్రమణలు, భూ కబ్జాలతో ప్రజలు విసిగిపోయారు. దీంతో ప్రజలు వైసీపీకి తగిన బుద్ధి చెప్పారు. కూటమికి జై కొట్టారు. ఈ ప్రభుత్వంలో కూడా వైసీపీ నాయకులు ఏ మాత్రం తగ్గకుండా యథేచ్ఛగా ప్రభుత్వ భూములు ఆక్రమించి బిల్డింగులు నిర్మిస్తున్నా అధికారుల్లో చలనం కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మరికొంత మంది అధికారులు మామూళ్ల మత్తులో ప్రజల భూములను భూఆక్రమణదారులకు ధారాదత్తం చేస్తున్నట్లు సమాచారం. మరికొంత మంది రెవెన్యూ సిబ్బంది భవిష్యత్తులో ప్రభుత్వం మారితే తమను ఇబ్బంది పెడతారేమో అనే భయంతో పట్టించుకోకుండా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే చర్చ సాగుతుంది. ఈ పరిస్థితుల్లో రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టి భూ ఆక్రమణదారుల కబంధ హస్తాల నుంచి ఆక్రమిత భూములు కాపాడాలని కోరుతున్నారు. అదేవిధంగా కడప నగరం మూడో డివిజనులోని పేదల కాలనీలో అక్రమంగా వైసీపీ నాయకులు ఆక్రమించి నిర్మాణం చేస్తున్న భవనాలను కూల్చి ప్రభుత్వ భూమికి కంచెను ఏర్పాటు చేసి బోర్డు పెట్టవలసిందిగా ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కడప తహసీల్దారును ఆంధ్రజ్యోతి వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



ఆక్రమణదారులు నిర్మిస్తున్న గృహాలు

మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడిపై కేసు నమోదు

ముద్దనూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ మెడికల్ ఏజన్సీ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీఐ దస్తగిరి వివరాల మేరకు.. నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఉప్పలూరు గ్రామానికి చెందిన పరమేశ్వరరెడ్డి దాదాపు 4 ఏళ్లుగా ఆరోగ్య మెడినీడ్స్ మెడికల్ ఏజన్సీ నడుపుతున్నాడు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలో మెడికల్ షాపు యజమాని పెనుజారి శ్రీధర్‌కు మెడిసిన్ పంపిణీ చేస్తానని రూ.99 లక్షలు తీసుకున్నాడు. రూ.3లక్షలకు మెడిసిన్ పంపించగా, మిగిలిన రూ.96లక్షలకు ఇవ్వాల్సి ఉంది. బాధితుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేశామని, ఏజన్సీ నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఏజన్సీ నిర్వాహకుడు అనంతపురం, ప్రొద్దుటూరు, కడప ప్రాంతాల్లోని కొన్ని మెడికల్ ఏజన్సీల నుంచి మందులను తెచ్చి జమ్మలమడుగు, కోవెలకుంట్ల ఇతర ప్రాంతాల్లోని మెడికల్ షాపులకు మందులు విక్రయించేవాడని, మెడికల్ షాపు చూపిస్తూ చాలా మంది వద్ద డబ్బులు అప్పు తీసుకున్నట్లు సమాచారం. అప్పు ఇప్పించిన మధ్యవర్తులకు నూటికి రూ.20 కమీషన్ ఇచ్చేవాడని, మధ్యవర్తుల ద్వారా కోట్లు అప్పు తీసుకున్నట్లు తెలిసింది. 10 రోజుల నుంచి ఏజన్సీ నిర్వాహకుడు కనిపించకుండా పోయాడని, మొబైల్ కూడా ఇంట్లో పెట్టి వెళ్లినట్లు సమాచారం. దీంతో అప్పులు ఇచ్చిన వారిలో ఆందోళన రేగుతోంది.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి పవిత్రోత్సవాలు ఈ నెల 24 నుంచి 26వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం అంకురార్పణ చేశారు. సాయంత్రం 6 గంటలకు మేదిని పూజ, అంకురార్పణ ఘట్టాలు నిర్వహించారు. యాత్రికుల వల్ల కాని, సిబ్బంది వల్ల కాని తెలియక జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానివ్వకుండా నిర్వహించేందుకు ప్రతి ఏడాది మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తూ ఉంటారు. ఈనెల 24న యాగశాలలో పవిత్ర ప్రతిష్ఠ, 25న పవిత్ర సమర్పణ, 26న వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ అధికారి హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, అర్చకులు వీణారాఘవాచార్యులు, శ్రావణకుమార్, మనోజ్‌కుమార్, పవన్‌కుమార్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు పమ్రాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వాల్మీకిపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో దిగువబొంపల్లె సమీపంలో శనివారం జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యుల సమాచారం మేరకు... రామసముద్రం మండలం ఆర్.నడింపల్లెకు చెందిన వెంకటనరసింహులు కుమారుడు సురేంద్ర (25) పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం పెయింటింగ్ పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరి వెళ్తుండగా ప్రమాదవశాత్తు బండి నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సురేంద్రను చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు గంధం మహోత్సవం

కడప కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా ప్రసిద్ధిగాంచిన కడప అమీన్‌పీర్ దర్గాలో ఆదివారం గంధం మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 10వ పీఠాధిపతి హజరత్ ఖాజా సయ్యద్‌షా అమీనుల్లా మహ్మద్ మహ్మదుల్ హుసేని చిష్టివుల్ ఖాద్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేస్తున్నట్లు తెలియజేశారు. 25న తహలీల్‌తో పాటు ఉరుసు రోజున ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. అన్నివర్గాల ప్రజలు గంధం, ఉరుసు మహోత్సవాలు విజయవంతం చేసేందుకు తరలిరావాలని కోరారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

● 26 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీకేదిన్నె మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేశారు. కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం శుక్రవారం సాయంత్రం నుంచి సీకే దిన్నె మండలంలోని మద్దిమడుగు ఫారెస్టు సెక్షన్‌లో స్థానిక అటవీ సిబ్బంది షకీల్ అహ్మద్, నారాయణరెడ్డితో కలిసి కూంబింగ్ చేపట్టారు. కోలుములపల్లి సమీపంలో కొంతమంది కారుతో కనిపించారు. చుట్టుముట్టేందుకు ప్రయత్నించగా కొందరు పారిపోగా, ముగ్గురు దొరికారు. పరిసర ప్రాంతాల్లో 26 ఎర్రచందనం దుంగలు లభించాయి. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను, కారును తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెంచురీ ప్యానల్స్ పరిశ్రమ తనిఖీ

గోపవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇండస్ట్రియల్ పార్కు వద్ద నిర్మించిన సెంచురీ ప్యానల్స్ పరిశ్రమను శనివారం ఆర్డీవో చంద్రమోహన్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వారు వాడే పదార్థాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపవరం తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, అగ్రికల్చర్ ఏడీతో పాటు బద్వేలు ఎంఈవో సెంచురీ ప్యానల్‌ను సందర్శించి వివరించారు. పరిశ్రమలోని హెచ్‌పీఎల్ ఎండీఎస్ ప్లాంట్లను సందర్శించారు. పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు.



కెమికల్స్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

లింగాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి భానుప్రకాష్ (22) శనివారం నంద్యాల జిల్లా పాణ్యం ఇంజనీరింగ్ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కుమారుడు ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లిదండ్రులు రాంభూపాల్, సరస్వతిలు తల్లడిల్లిపోతున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



భానుప్రకాష్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

కడప క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం దేవునికడపకు చెందిన యల్లనూరు ప్రనుష్‌కుమార్‌రెడ్డి (14) శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై కూర్చుని ఉండగా వేగంగా వస్తున్న మరో వాహనం ఢీకొనడంతో ఆ బాలుడు బ్రిడ్జి మీద నుంచి నీటిలో పడి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, మృతుడి తండ్రి నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

రూ.45 కోట్లతో మఠం అభివృద్ధికి శ్రీకారం: ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానకర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి వహించిన దేవస్థానాన్ని రూ.45 కోట్ల నిధులతో త్వరలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శనివారం మఠం దేవస్థానాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం తీర్థయాత్ర పునరుజ్జీవనం ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి డ్రైవ్ (ప్రసాదం) కేంద్ర ప్రయోజిత పథకం కింద నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మఠాన్ని ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, తాత్విక, సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆలయ ప్రాంగణంలో ముఖ్యంగా వెయ్యిమంది భక్తులు బస చేసేందుకు షెడ్డు ఏర్పాటు చేస్తామని, రోడ్డు వెడల్పు, డ్రైనేజీ ఏర్పాటు, పోలేరమ్మ గుడి, కక్కయ్య గుడి అభివృద్ధి, బ్రహ్మంగారి నివాసం వీధి, రచ్చబండ, అలాగే వేదపాఠశాల, బి.మఠం దేవస్థానం ఆలయం చుట్టూ లైటింగ్ మాడవీధులుగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనరు రామచంద్రమోహన్, డిప్యూటీ కమిషనరు పట్టెం గురుప్రసాద్ కలిసి మఠంలో ఇప్పటివరకు నూతనంగా నిర్మాణం చేపట్టిన కళ్యాణ మండపం, డార్మిటరీ భవనాలను పరిశీలించారు. త్వరలోనే అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనరు మల్లికార్జునప్రసాద్, దేవదాయశాఖ అధికారి శంకరబాలాజీ, మేనేజరు ఈశ్వరాచారి, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, ముదుమాల పోలిరెడ్డి, సర్పంచ్ నారాయణ, మేకల సుధాకర్, మల్లె బాలక్రిష్ణ, శీలం నరసింహగౌడ్, బాలగౌడ్ పాల్గొన్నారు.



కమిషనరుతో కలిసి మఠం ఆవరణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అంకిశెట్టిపల్లె నల్లగుట్టపై పోలీసుల పహారా

● మదనపల్లెలో బందోబస్తు..అంతా ప్రశాంతం

మదనపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె సమీపంలోని నల్లగుట్టపై జరుగుతున్న వివాదం నేపథ్యంలో శనివారం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుద్ధుడి కొండపై విగ్రహం పునఃప్రతిష్ఠామని, ఇందుకు తమిళనాడు రాష్ట్రం చిదంబరం ఎంపీ తిరుమావళవన్ వస్తున్నారని భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ ఇదివరకే ప్రకటించారు. ఇందులో భాగంగా సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం నిర్వహించారు. అంకిశెట్టిపల్లె నల్లగుట్ట ప్రభుత్వానికి చెందిందని, అక్కడ ఎవరికీ అనుమతి లేదంటూ పోలీసులు, రెవెన్యూశాఖ సంయుక్తంగా ప్రకటించింది. మరోవైపు ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో బాస్ అధినేత కూడా కార్యక్రమాన్ని రద్దు చేసుకుంటున్నట్లు శుక్రవారమే ప్రకటించారు. అయితే పోలీసులు మాత్రం శనివారం నల్లగుట్టపై నిఘాతో పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బందోబస్తుతో పహారా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం, బెంగళూరు బస్టాండు, ఎన్టీఆర్ సర్కిల్, నీరుగట్టువారిపల్లెతో పాటు పట్టణంలోకి ప్రవేశించే నాలుగు ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద పోలీసులు మోహరించారు. మరోవైపు నల్లగుట్ట చుట్టూ నిఘా పెట్టిన పోలీసులు డ్రోన్లతో ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. ఇందులో వంద నుంచి 150 మంది వరకూ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక డీఎస్పీ మహేంద్ర బందోబస్తును పర్యవేక్షించగా, తాలూకా సీఐలు కళా వెంకటరమణ, సత్యనారాయణ, వన్‌టౌన్, టూటౌన్ సీఐ మహ్మద్‌రఫీ, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందే పోలీసులు కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ముందస్తు చర్యల నేపథ్యంలో అక్కడ ఎలాంటి సంఘటనలు, వివాదాలు జరగకపోవడంతో అటు పోలీసులు, ఇటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



నల్లగుట్ట కింది భాగంలో పోలీసుల పహారా

సాక్ష్యాలు ఎలా నిలుస్తాయో తెలుసుకోవాలి

● హైకోర్టు రిటైర్డ్ జడ్జి రాధాకృష్ణ కృపాసాగర్

మదనపల్లె టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పరిజ్ఞానంలో మారుతున్న డిజిటల్ పరికరాలతో కోర్టులో ఫస్ట్, సెకండరీ ఎవిడెన్స్‌లు ఎలా నిలుస్తాయో న్యాయవాదులు తెలుసుకోవాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ వి.రాధాకృష్ణ కృపాసాగర్ చెప్పారు. శనివారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్‌చే ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్, సైబర్ లా అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ యుగంలో ఏదైనా సివిల్, క్రిమినల్ కేసుల్లో కాల్ రికార్డింగ్, వీడియోలు, ఆడియోలు ఎలా సాక్ష్యాలుగా పనికి వస్తాయో వివరించారు. వ్యక్తుల ప్రైవసీని కాపాడే ఇలాంటివి సెకండరీ ఎవిడెన్స్‌గా న్యాయవాదులు సమర్పించగలిగితే వీటిని కోర్టు పరిగణిస్తుందన్నారు. కొన్ని లింకులతో మొబైల్ హ్యాక్ చేసి వ్యక్తుల డబ్బులు కాజేసే సైబర్ నేరాల్లో సాక్ష్యాలను ఎలా తీసుకోవచ్చు, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ వివరాలను పోలీసులకు ఇస్తే వారు కోర్టుకు ఎలా సబ్మిట్ చేయాలో వివరించారు. ఫ్యామిలీ మ్యాటర్ కేసుల్లో సాక్ష్యాలు కోర్టులో ఎలాప్రవేశపెట్టాలో వివరించారు. ప్రతి ఒక సాక్ష్యానికి సర్టిఫైడ్ కాపీలు సమర్పించాలని, అంతే కాకుండా మొబైల్‌లో రికార్డు చేసిన అంశాలపై ఒరిజినల్ ఫార్మాట్‌లోనే కోర్టులో ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో 2వ ఏడీజే సూర్యనారాయణ మూర్తి, న్యాయాధికారులు ఆర్.శ్రీలత, జయలక్ష్మి, శిరీష్, సుబహాన్, జె.కీర్తన, బార్ అసోసియేషన్ కార్యదర్శి మనోహర్ గౌడ్, సంయుక్త కార్యదర్శి సోమశేఖర్, పెద్దసంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్

డీఎస్సీలో 28వ ర్యాంక్



వాల్మీకిపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులంపల్లెకు చెందిన వి.రెడ్డెమ్మ ఇటీవల డీఎస్సీ పరీక్షలు రాసి వచ్చిన ఫలితాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో (ఇంగ్లీష్) స్కూల్ అసిస్టెంట్‌లో 28వ ర్యాంక్ సాధించాడు. ఉత్తమ ర్యాంక్ సాధించిన రెడ్డెమ్మకు గ్రామస్తులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. 28వ ర్యాంక్ రావడం పట్ల సంతోషంగా ఉందని తెలిపారు. కాగా ప్రస్తుతం రెడ్డెమ్మ గ్రామ సచివాలయ మహిళా పోలీసుగా పనిచేస్తోంది.

సూపర్ సిక్స్‌లో మహిళలకు మూడు పథకాలు

● నియోజకవర్గ టీడీపీ మహిళా నేత కల్పనరెడ్డి

ములకలచెరువు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న సూపర్‌సిక్స్‌లో మహిళల కోసమే మూడు ప్రధాన పథకాలు ఉన్నాయని తంబళ్లపల్లె నియోజవర్గ టీడీపీ మహిళా నేత దాసరిపల్లి కల్పనరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం తంబళ్లపల్లె నియోజకవర్గంలో వచ్చే వారంలో నిర్వహించనున్న స్త్రీ శక్తి భారీ బహిరంగ సభపై మహిళలతో చర్చించిన ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు సూపర్ సిక్స్ పథకాలైన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలను అమలు చేస్తున్నారన్నారు. స్త్రీ శక్తి బహిరంగ సభకు నియోజవర్గంలోని మహిళలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మహిళా నేతలు పూల సుజాత, వనజమ్మ, మల్లికాబేగం, సిద్దమ్మ, నగీనాబేగం, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయాలు సొంతం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మోటివేటర్ రామ్మూర్తి

కురబలకోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే విజయాలు సొంతం చేసుకోవచ్చని రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మోటివేటర్ రామ్మూర్తి పేర్కొన్నారు. డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీలో మెదటి సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉంటుందని, ప్రతి ఒక్కరూ లక్ష్యాలను చేరుకోవడానికి నిర్ధిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. నిజ జీవితంలో అనేక సవాళ్లు ఎదురవుతుంటాయని వాటికి ఏ మాత్రం అధైర్య పడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు సత్వరమార్గాల కంటే స్థిరమైన ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టి పెట్టాలన్నారు. యువత చెడు వ్యసనాలకు, ఆకర్షణలకు లోను కాకుండా భవిష్యత్‌కు బాసట వేసుకోవాలన్నారు. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా తల్లిదండ్రులు ప్రేరేపించాలన్నారు. లక్ష్యసాధనలో ఎదురయ్యే అవరోధాలను ఏ మాత్రం అధైర్యపడకుండా విజయాలను చేరుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి విజయాలను సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు పేరుప్రఖ్యాతలను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రో ఛాన్సలర్ ద్వారకనాథ్, కో ఆర్డినేటర్ విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వక్ఫ్ బోర్డు అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గుర్రంకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గుర్రంకొండకు చెందిన షంషీర్ వలి దర్గా ముతవల్లి కాలేషా మస్తాన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. గుర్రంకొండ రెవెన్యూ గ్రామం గుర్రంకొండ-గాలివీడు మార్గంలో షంషీర్ వలి దర్గా ఉంది. ఈ దర్గా ముతవల్లిగా కాలేషా మస్తాన్ పదవీకాలం ఇటీవల ముగిసింది. ఈ క్రమంలో షంషీర్ వలి దర్గా వద్ద 21వ తేదీన ప్రార్థనలు చేస్తుండగా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ అక్రమ్ వచ్చి బెదిరించాడని తెలిపారు. ముతవల్లి పదవీ కాలం రెన్యువల్ చేసుకోవాలని అందుకు లంచం ఇవ్వాలంటూ డిమాండు చేశాడని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనపై అసభ్యకరంగా ప్రవర్తించి, అక్రమాలకు పాల్పడిన అధికారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరాడు.

ప్లాస్టిక్‌ను నిషేధించండి

నిమ్మనపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణానికి తోడ్పాటు అందించాలని ఎంపీడీఓ రమేష్ అన్నారు. శనివారం స్థానిక బస్టాండులో మండల అధికారులు, విద్యార్థులు కలిసి ప్లాస్టిక్ నిసేధంపై ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా వుంచుకోవడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు ఎన్ని ఏళ్లయినా భూమిలోనే వుండి వాటి ద్వారా రోగాలు అధికంగా వస్తాయన్నారు. ఎంఈఓ పద్మావతి, ప్రధానోపాధ్యాయులు అంజాద్, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి మహాగణపతి

పీఓపీ ప్రతిమలతో పర్యావరణానికి ముప్పు ● మదనపల్లె పరిసరాల్లో పది వినాయక ప్రతిమల విక్రయ కేంద్రాలు

పర్యావరణ హిత ప్రతిమలు ఇక్కడి ప్రత్యేకత ● బయటి రాష్ట్రాల నుంచీ కొనుగోలు దారుల రాక



మదనపల్లె అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మట్టితో తయారు చేసిన గణపతిని పూజించడం వలన అనేక రకాల సమస్యలు తొలగుతాయని ప్రతీతి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక ప్రతిమలతో పర్యావరణానికి ముప్పు కలుగుతోందని, మట్టి వినాయక ప్రతిమలు వినియోగించాలని పర్యావరణ వేత్తలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తుంటాయి. అయినా ఎక్కడ చూసినా అందంగా కనిపించే పీఓపీ గణపతులను ఏర్పాటు చేస్తుంటారు. మట్టిగణపతి మహాగణపతి అంటూ ర్యాలీలు చేపట్టినా ఇంకా చాలామందిలో చైతన్యం రావాల్సిఉంది. పట్టణం, మండల ప్రాంతాల్లో పది చోట్ల వినాయక ప్రతిమల తయారీ కేంద్రాలను నిర్వహకులు ఏర్పాటు చేశారు. ఇందులో మూడు అడుగుల ప్రతిమలు మొదలు 25 అడుగుల వరకు తయారు చేసి సిద్ధం చేస్తున్నారు. శివపార్వతులు, ఎలుక వాహనంపై వినాయకుడు, వరసిద్ధి వినాయకుడు, కాణిపాక వినాయకుడు, లంబోదరుడు వంటి రూపాల్లో వినాయక ప్రతిమలు తయారు చేసినట్లు చెప్పారు. సీటీఎం గ్రామంలో రామమూర్తి ఆధ్వర్యంలో 400 వినాయక ప్రతిమలు, ఎనుమల వారిపల్లె వద్ద కుమార్ ఆధ్వర్యంలో 500, ఆరోగ్య వరం తురకపల్లె వద్ద, ఎర్రగానిమిట్ట వద్ద శ్రీనివాసులు, ఆధ్వర్యంలో వెయ్యి ప్రతిమలు, వేంపల్లె గ్రామం బండకాడపల్లె ప్రతిమలకు భలేగిరాకీ ఉందన్నారు. ఇక్కడ పర్యావరణానికి హాని కలిగించని పదార్థాలతో సి. అమర నారాయణ, సీ. శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనగ పిండి గంజి, బంకమట్టి, పేపర్ వ్యర్థాలతో వెయ్యి ప్రతిమలు తయారు చేసి సిద్ధం చేశారు. వివిధ ఆకృతులతో ఉన్న అచ్చులను ఉపయోగించి ప్రతిమలను తయారు చేశారు. వీటికి కలర్స్ అద్ది సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. ఇవి పర్యావరణానికి హాని కలిగించవని, నిమజ్జనం సమయంలో నీళ్లలో త్వరగా కరిగిపోతాయని నిర్వహకులు వివరిస్తున్నారు. ప్రతిమలకు కావాల్సిన ముడి సరుకు కొంత స్థానికంగాను, మరి కొంత తమిళనాడు, కాంచీపురం, మద్రాసు నుంచి కూడా తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పండుగకు నాలుగు నెలల ముందునుంచే ప్రతిమలు తయారు చేస్తామన్నారు. మూడు కుటుంబాలు దశాబ్దకాలం నుంచి వినాయక ప్రతిమలు తయారు చేయడం కుటీర పరిశ్రమగా మార్చుకున్నామన్నారు. దీంతో సుమారు 500 మందికిపైగా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. పట్టణంలో గొల్లపల్లె బైపాస్ రోడ్డు, బెంగూరు రోడ్డు, పుంగనూరు బైపాస్‌రోడ్డు, బెంగళూరు బస్టాండ్, చిత్తూరు బస్‌స్టాండ్ ప్రాంతాల్లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నీరుగట్టువారిపల్లె, పెంచుపాడు రోడ్డులో చిన్న, చిన్న మట్టి వినాయక ప్రతిమలు మట్టి ప్రమిదలు వివిధ రూపాల్లో తయారు చేసి విక్రయిస్తుంటారు. పట్టణంలో రెండు మూడు కేంద్రాల్లో రాజస్థాన్, ఛతీస్‌ఘడ్ ప్రాంతాల నుంచి వచ్చి ప్రతిమలు తయారీ, రంగుల అద్దడం ఉపాధిగా ఎంచుకుని పని చేస్తుంటారు. కార్మికులు వందల మంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మదనపల్లెలో ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా సీటీఎం, ఎనుములవారిపల్లె, ఎర్రగాని మిట్ట వద్ద అధిక సంఖ్యలో, అతి పెద్ద ప్రతిమలను వినాయక చవితికి సిద్ధం చేశారు. ఇక్కడ మూడు వేల రూపాయల ధర నుంచి లక్ష రూపాయల ధర పలికే ప్రతిమలు తయారు చేశామని నిర్వాహకులు చెప్పారు. ముడి సరుకు ధరలు పెరిగాయని, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు అధికంగా వస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. వినాయక ప్రతిమలను ముందుగానే ఇతర రాష్ట్రాల నుంచి వినాయక ఉత్సవ కమిటీ సభ్యుల నుంచి అడ్వాన్సు తీసుకుని ఆర్డర్‌ను తీసుకుంటారన్నారు. స్థానికులే కాక ఇతర జిల్లాలైన తిరుపతి, నెల్లూరు, చిత్తూరు అనంతపురం, కడప, కర్ణాటక, తమిళనాడు నుంచి అధికంగా వినాయక ప్రతిమలను కొనుగోలు చేసి పండగ నాటికి తరలిస్తారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే మదనపల్లె ప్రాంతాల్లో వినాయక ప్రతిమలు సరసమైన ధరలకే దొరుకుతాయన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి హోల్‌సేల్‌గా ప్రతిమలను కొనుగోలు చేసి బయటికి తీసుకెళ్లి రిటైల్‌గా అమ్మకాలు చేసే వారూ ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడడానికి మట్టి, పేపర్, సిమెంట్ పేపర్‌తో తయారైన ప్రతిమలనే ఉపయోగించాలని ప్రజలను వారు కోరారు.





సీటీఎంలో వేడుకకు సిద్ధమవుతున్న ప్రతిమలు - విక్రయ కేంద్రాల్లో వినాయక ప్రతిమలకు రంగులద్దుతున్న కార్మికులు - వివిధ రూపాల్లో వినాయక ప్రతిమలు

ఘనంగా టీడీపీ నేత బాబురెడ్డి జన్మదిన వేడుకలు



గంగారపు బాబురెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నేతలు కె.మల్లికార్జుననాయుడు, రామదాస్‌చౌదరి, జంగాల శివరామ్ తదితరులు

మదనపల్లె, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గంగన్నగారిపల్లె వాని టీడీపీ సీనియర్ నేత గంగారపు బాబురెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో శనివారం కూటమి నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. ఇందులో టీడీపీ తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, తంబళ్లపల్లె టీడీపీ కో-ఆర్డినేటర్ కోఫూరి మల్లికార్జున నాయుడు, జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరామ్, మాజీసైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచెర్ల శ్రీనివాసులు నాయుడు, నారా లోకేష్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు కంచెర్ల చింటూ బాబురెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జనసేన, టీడీపీ నేతలు పి.నాగేంద్ర, పి.యశ్వంత్, జి.జయన్న, నాదెళ్ల రామచంద్రనాయుడు, పి.నటశేఖర్, గంగారపు గౌతమ్‌రెడ్డి, ఫణికర్‌రెడ్డి, వై.దొరస్వామి నాయుడు, సంద్ర నారాయణస్వామి, బాలప్పగారి రమేష్, రాటకొండ సుధాకర్ నాయుడు, దేవుడు రమేష్, కంచర్ల రంగస్వామి నాయుడు, కత్తి లక్ష్మన్న, ఆర్.వి.నాయుడు, రామ్మోహన్ నాయుడు, ఎం.జయచంద్ర నాయుడు, ఆర్.రమణయ్య నాయుడు, ఎం.రవి, ఆర్.రాంబాబు, బి.నారాయణస్వామి, పైపుల రమణ, మోదుపల్లె రవి, పి.కిరణ్‌కుమార్, డి.పురుషోత్తం, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి



బి.కొత్తకోట ర్యాలీలో పాల్గొన్న జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా చేట్టిన స్వచ్ఛాంధ్రలో ఉద్యోగులు సహా ప్రజలందరూ భాగస్వాములు కావాలని తంబళ్ల పల్లి టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం బి.కొత్తకోటలో నగరపంచాయతీ కార్యాలయం నుంచి దిగువ బస్టాండు మీదుగా బ్యానర్లు చేతపట్టి జ్యోతిసర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ పల్లవితో కలిసి మురుగునీటి కాల్వలో చెత్తను తొలగించిన ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలని, పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు అధికారులకు సహకరించాలని కోరారు. ఎంపీడీఓ క్రిష్ణవేణి, ఏపీఎం రాజేశ్వరి, నేతలు డేరింగుల నారాయణ, మొటుకు శివ, చింత లకిరణ్, గంజి మోహన, లోకనాథరెడ్డి, శివరాం, చావిడికిట్టన్న, ఎండీమస్తాన్, ఎల్.సికిందర్, నాసిర్, సిద్దారెడ్డి, మస్తాన్‌రెడ్డి, కాశిపల్లి సుబ్బారెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

తంబళ్లపల్లె, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛాంధ్రలో భాగస్వాములమవుదామని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఎల్‌డీఓ అమర్‌నాథరెడ్డి సూచించారు. కూటమి నేతలతో కలిసి అధికారులు స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. రాగి మాను కూడలి నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి పరిశుభ్రత, ప్రాధాన్యత, మొక్కల పెంపకంతో ఉపయోగాలు, ప్లాస్టిక్ వల్ల కలిగే అన ర్థాలను వివరించారు. ఎంపీడీఓ థామస్‌రాజ, ఎంఈ ఓ నాగసుబ్బరాయుడు, టీడీపీ నేతలు నరసింహులు, రామాంజులు, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక చొరవ చూపాలి

పీలేరు రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంటు రోగాలు ప్రబలకుండా శానిటేషన్‌పై ప్రత్యక చొరవ చూపాలని మండల ప్రత్యేకాధికారి క్రిష్ణకిషోర్ తెలి పారు. పీలేరు పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛఆంధ్రలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులచే సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి మాన వహారం చేపట్టారు. ఎంపీడీఓ శివశంకర్, పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ లతీఫ్‌ఖాన్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

పీటీఎంలో స్వచ్ఛాంధ్ర...

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛఆంధ్రలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన కల్పించారు. శ్రమదానం చేసి ఆయా పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తా చెదారం, వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. గునపం, పారలు చేతబట్టి పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రజలందరూ వారి ఇండ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

11వ అదనపు జిల్లా జడ్జి మహేష్



సమావేశంలో మాట్లాడుతున్న 11వ జిల్లా అదనపు జడ్జి మహేష్

పీలేరు రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 11వ జిల్లా అదనపు జడ్జి మహేష్ తెలిపారు. పీలేరు కోర్టు ఆవరణలో పోలీస్ అధికారులతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు. ఎన్.ఐ. యాక్ట్ మొదలైన కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని చెప్పారు. వీటితోపాటు ఎన్నో ఏళ్లగా పెండింగ్ కేసుల పరిష్కారం దిశగా తీసుకెళ్లాలని పోలీస్ అధికారులు సూచించారు. ఇప్పటి నుంచే ఏఏ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం అవుతాయో వాటి కక్షిదారులను పిలిపించి కేసులను పరిష్కరించాలని తెలిపారు. స్పెషల్ మెజిస్ట్రేట్ మురళి, పీలేరు సీఐ యుగంధర్, కేవీపల్లె, రొంపిచెర్ల, ఎర్రావారిపాళ్యం, సదుం, పీలేరు ఎక్సైజ్ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు పారుతోంది



కాల్వలను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

తంబళ్లపల్లె, ఆగస్టు 23(ఆంధ్ర జ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ ఎదుట, వెనుక వైపు గల వీధుల్లో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోందని, రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు డీఎల్‌డీఓ అమర్‌నాథరెడ్డికి ఫిర్యాదు చేశారు. శనివారం తంబళ్లపల్లెలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మండల కేంద్రంలో రెండేళ్ల కిందట నిర్మించిన మురుగు నీటి కాల్వలపై మూతలు లేక దుర్వాసన వస్తోందని, దోమలు ఎక్కువై రోగాల బారిన పడుతున్నామని డీఎల్‌డీఓకు ఫిర్యాదు చేశారు. మసీదు వీధిలో రోడ్డుపై నీరు నిలిచి ఇళ్లలోకి వస్తోందని వీధి వాసులు వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందన లేదని మురుగు నీటి కాల్వలు నిర్మించి సమస్య తీర్చాలని మొరపెట్టుకున్నారు.

పారిశుధ్యంపై డీఎల్‌డీఓ సీరియస్

పారిశుధ్య పనులు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యంపై డీఎల్‌డీఓ అమర్‌నాథరెడ్డి మండిపడ్డారు. స్వచ్ఛాంధ్రకు అధికారులు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మసీదు వీధిలోని మురుగుకాల్వలపై వెంటనే మూతలు వేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట వీధిలో డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నివేదికలు తయారు చేసి పంపాలని సూచించారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఉండరాదని హెచ్చరించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

నిమ్మనపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు, స్టాకు రిజిస్టర్, రోజువారి ఓపీ, మూమెంట్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కువగా మారు మూల గ్రామాల నుంచి రోజుకు 150 నుంచి 170 మంది వరకు రోగులు వచ్చే అవకాశం ఉందని వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనంతరం స్టాకు రూమును తనిఖీ చేసి రోజువారీ స్టాకుపై తనిఖీ చేయాలని డాక్టర్ ప్రత్యూషకు తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ లేదని వారానికి రెండు రోజులు మాత్రమే ఒకరు వస్తుడంతో రోగులకు ఇబ్బందులు తప్పడంలేదని సిబ్బంది తెలిపారు. వెంటనే రెగ్యులర్ ల్యాబ్ టెక్నీషియన్ సహా నైట్ వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపమని తెలిపారు. ఏఎన్‌ఎం రెడ్డెమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో యూరియా కొరత లేదు

కలికిరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియాకు కొరత లేదని రైతులకు అవసరమైన మేరకు నిల్వలు అందుబాటులో వున్నాయని ఎంఏఓ హేమలత, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎన్.నారాయణ తెలిపారు. శనివారం యూరియా అందుబాటులో వున్న ఎరువుల దుకాణాన్ని పలువురు అధికారులు తనిఖీ చేశారు. సీవీ భాస్కర్ రెడ్డి దుకాణంలో 3.4 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ వుందన్నారు. మిగిలిన దుకాణదార్లు కూడా ఇండెంట్లు పంపారని, నాలుగు రోజుల్లో వారికి కూడా యూరియా వస్తుందని చెప్పారు. 45 కిలోల బస్తాను రూ.266.50లకు మాత్రమే అమ్మాలని, డిమాండు ఏర్పడిన దృష్ట్యా ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. తహసీల్దారు హరికుమార్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఎంఏఓ హేమలత తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

వాల్మీకిపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని చింతపర్తి పీహెచ్‌సీ డాక్టర్ జులేఖాబేగం పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించడం అలవర్చుకోవాలన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్భయంగా వైద్యం చేయించుకోవాలి

సమాజంలో యువత ఎలాంటి అపోహకలకు గురి కాకుండా నిర్భయంగా వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా జీవించవచ్చని ఐసీటీసీ కౌన్సిలర్ లోకేష్ పేర్కొన్నారు. వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఐవీ ఎయిడ్స్, టీబీ పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం వసుంధర, పిడీ ఉషారాణి, ఎస్‌జీఓ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

తంబళ్లపల్లె, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్ సూచించారు. ఐసీటీసీ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కృషి సంస్థ సహకారంతో స్థానిక ఐటీఐలో ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన నిర్వహించారు. అనంతరం 'మీకు తెలుసా' పోస్టర్లను ఆవిష్కరించారు. ఐటీఐ ప్రిన్సిపాల్ నాగరాజు, ఎల్‌టీ బాలాజి, కృషి సంస్థ మేనేజరు శ్రీనివాసులు, ఓఆర్‌డబ్ల్యూ సావిత్రి, పల్లవి పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతను పాటించాలి

గుర్రంకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని గుర్రంకొండ పంచాయతీ ఈఓ శ్రీహరి అన్నారు. కొత్తపేట, నబీకాలనీ, పోలేరమ్మవీధిలో పారిశుధ్య పనులను చేయించారు. ప్రజలు ఇళ్లలో చెత్తను రోడ్లపై పడేకుండా చెత్తకుండిలోనే వేయాలని ఆయన సూచించారు. చెత్తచెదారాన్ని చెత్తబండిలోనే వేసి శుభ్రతను పాటించాలన్నారు. అనంతరం వీధుల్లో చెత్త సేకరణను తనిఖీ చేసి కార్మికులకు పలు సూచనలు చేశారు.

సమయపాలన పాటించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ వన్ డిపో గ్యారేజ్ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించినట్లు ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం సమావేశంలో డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ పని చేయాలని సూచించారు. డిపోలో సిబ్బంది కొరత కారణంగా ఆన్‌కాల్ డ్రైవర్లను అధిక సంఖ్యలో నియమిస్తున్నట్లు చెప్పారు. బస్సులను మంచి కండీషన్స్‌లో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.